



వాడిన మాల తొలగించారు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల మొదటి ఘాట్, అలిపిరి నడకమార్గంలోని ప్రసన్న ఆంజనేయస్వామికి ఉన్న వాడిన మాలను తొలగించారు. హనుమజ్జయంతి సందర్భంగా మే నెలలో ఆంజనేయస్వామికి వేసిన ఆకు, పూలమాలలు వాడిపోయినా తొలగించలేదు. దీనిపై 'మాల వాడిపోయింది గోవిందా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. వీరి ఆదేశాలతో వాడిపోయిన మాలలను తొలగించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



జగన్ పీ4 ఏంటంటే..

చంద్రబాబు తీసుకొచ్చే పీ4 అంటే పబ్లిక్, ప్రైవేట్ పీపుల్, పార్టనర్‌షిప్. పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన ఈ కార్యక్రమం కోసం సీఎం శ్రమిస్తున్నారు. అదే జగన్ పీ4 అంటే.. ప్రాఫిట్, ప్యాలెస్, పులివెందుల, పర్సనల్ ఎజెండా. దీనికోసమే సీఎంగా ఐదేళ్లపాటు ఆయన పనిచేశారు.

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ఆచూకీ చెబితే రూ.5లక్షలు

తమిళనాడు రాష్ట్రం ఆరంబాకంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ.5లక్షలు నజరానా ఇస్తామని గుమ్మిడిపూడి డీఎస్పీ జయశ్రీ తెలిపారు. నిందితుడి గాలింపు చర్యల్లో భాగంగా సత్యవేడు, వరదయ్యపాళెం, తడ మండలాల్లో మంగళవారం డీఎస్పీ పర్యటించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించామన్నారు. నాలుగు బృందాలు నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఆమె తెలిపారు.


- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి



లిక్కర్ స్కాం.. వైసీపీ నీరసం

- అధిష్ఠానం ఆదేశాలతో మూడో రోజు నామమాత్రపు నిరసనలు
- పెద్దిరెడ్డిపై పార్టీలోనూ అసంతృప్తే కారణమా?

రెండు రోజులు ప్రకటనలకే పరిమితమైన వైసీపీ నేతలు



మిథున్‌రెడ్డి అరెస్టుపై స్పందన అంతంతే!

చిత్తూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వైసీపీ స్పందన, ఆ పార్టీ జిల్లాలో ఎంత బలహీనంగా మిగిలిందో వెల్లడిస్తోంది. రాజకీయంగా ఉమ్మడి జిల్లాను శాసించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు, జగన్‌కి అత్యంత సన్నిహితుడైన ప్రస్తుత ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు పట్ల జనంలో వ్యతిరేకత లేకపోయినా, కనీసం పార్టీలో అయినా తగినంత స్పందన లేకపోవడం ఏమిటని.. వైసీపీ నేతలో చాలా మంది ఆశ్చర్యపోతున్నారు. నాయకులు మీడియా మీట్‌లూ, ప్రకటనలకే పరిమితం కావడం, అక్కడక్కడా చిన్నపాటి నిరసనలతో సరిపెట్టుకోవడం వారిని ఆందోళన పెడుతోంది. పెద్దిరెడ్డి రాజ్యంగా విలసిల్లిన పుంగనూరు నియోజకవర్గంలోనూ నీరసంగానే నిరసన సాగడం విశేషం.

మద్యం కుంభకోణం విషయంలో మిథున్‌రెడ్డిని శనివారం ఏడు గంటలపాటు విచారించిన సిట్, అదే రోజు రాత్రి అరెస్టు చేసింది. శని, ఆదివారాల్లో వైసీపీ నాయకులు జిల్లాలో ఎక్కడా నిరసనలు చేయలేదు. పత్రికా ప్రకటనల్ని మాత్రమే విడుదల చేశారు. సోమవారం వైసీపీ అధిష్ఠానం ఆదేశించడంతో, కొన్నిచోట్ల నామమాత్రంగా నిరసనలు చేశారు. చిత్తూరు, పుంగనూరు, పలమనేరు ప్రాంతాలతో పాటు మిథున్‌రెడ్డి సొంత ప్రాంతం సదుంలో సుమారు 100-150 మందితో నిరసనలు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో కాసేపు రోడ్ల మీద ప్లకార్డులతో నిలబడి వెళ్లిపోయారు. ఈ తీరుపై వైసీపీలోనే కాదు ప్రజల్లోనూ తీవ్ర చర్చ నడుస్తోంది.

జనంలో సానుభూతి కరువు

జగన్ అధికారంలో ఉన్నప్పుడు మద్యం ధరలు విపరీతంగా ఉండడం, ఊరూ పేరూ లేని కొత్త బ్రాండ్లు మాత్రమే అమ్మడం, వాటి వల్ల తీవ్ర అనారోగ్యానికి గురవడం వంటి కారణాల వల్ల ప్రజల్లో వ్యతిరేకత బలంగా ఉందని భావిస్తున్నారు. దీనికి కారకులైన వారిపట్ల కనీస సానుభూతి కూడా ఇందువల్లే కరువైందని అంటున్నారు. పైగా వేల కోట్ల సొమ్ములు దోచుకున్న తీరు మీడియాలో కథనాలుగా వస్తుండంతో ఇంతకు తెగించారా అని ప్రజలు నోళ్లు వెళ్లబెడుతున్నారు. అందుకే అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రతి పండక్కీ పబ్బానికీ వందల కోట్లు ఖర్చు పెట్టి బట్టలు, కానుకలూ, మిఠాయిలూ పంపినా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వంటివారి పట్ల కూడా చంద్రగిరి నియోజకవర్గంలో సైతం సానుభూతి లేదని జనంలో చర్చ నడుస్తోంది. జనంలో సానుభూతి లేకపోవడం వల్లే వైసీపీ నాయకులు కూడా వారి తరహా బలప్రదర్శనతో కూడిన నిరసనలకు ధైర్యం చేయలేకపోతున్నారని అంటున్నారు.

వైసీపీలోనూ వ్యతిరేకత

పెద్దిరెడ్డి కుటుంబంపై జిల్లా వైసీపీ శ్రేణుల్లోనూ తీవ్ర అసంతృప్తి ఉండడంతోనే అరెస్టుపై అనుకున్నంత స్పందన లేదని తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యేలకు వ్యతిరేక వర్గాలను ఏర్పాటు చేసి ప్రోత్సహించడం.. మైన్స్, వైన్స్, సాండ్, ల్యాండ్ వంటి అన్నింట్లోనూ ద్వితీయ శ్రేణి నాయకులకు అందకుండా తనే నడపడం.. వంటి కారణాలతో ఆ కుటుంబంపై జిల్లా వైసీపీ నాయకుల్లో వ్యతిరేకత ఉందనే విషయం ఇప్పుడు వెల్లడవుతోందని ఆ పార్టీ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది.

ఇదీ పెద్దిరెడ్డి ఘనత

జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి చక్రం తిప్పిన తీరును గుర్తు చేసుకుంటున్నారు. 2019 ఎన్నికల సమయంలో పూతలపట్టు సిట్టింగ్ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను కాదని ఎంఎస్‌బాబును తెరపైకి తెచ్చారు.2024లో మళ్లీ ఎంఎస్‌బాబును ఇబ్బంది పెట్టారు. సునీల్‌కుమార్ అప్పట్లో జగన్ ఇంటి ఎదుట రోజంతా నిలబడినా అపాయింట్‌మెంట్ ఇవ్వని వీడియో దళిత సంఘాల్లో ఆగ్రహాన్ని రగిల్చింది. 2024లో ఎంఎస్‌బాబుతో పాటు సత్యవేడు ఆదిమూలానికీ టికెట్ రాకుండా చేయడంతో ఇద్దరూ పెద్దిరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. పెనుమూరుకు చెందిన మాజీ ఎంపీ జ్ఞానేందర్‌రెడ్డిని ప్రోత్సహించి డిప్యూటీ సీఎంగా ఉన్న నారాయణస్వామిని ఇబ్బంది పెట్టారనే ఆరోపణలున్నాయి. నగరిలో రోజాను ఇబ్బంది పెట్టేందుకు చక్రపాణిరెడ్డి, కేజే కుమార్ వంటివారిని ప్రోత్సహించారు. చిత్తూరులో అటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల్ని, ఇటు విజయానందరెడ్డినీ ఎదగనీయకుండా పావులు కదిపేవారు. ఎన్నికల సమయంలో విజయానందరెడ్డితో బాగుంటూనే ఆయనకు టికెట్ రాకుండా తీవ్ర ప్రయత్నాలు చేశారని ఆరోపణలున్నాయి. జనసేనలోకి ఆరణి వెళ్లిపోయేలా చేశారు. ఈ ఇద్దర్నీ కాకుండా మూడో వ్యక్తి కోసం ప్రయత్నించినట్లు సమాచారం. పలమనేరులో వెంకటేగౌడకు చెక్ పెట్టేందుకు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తిని విపరీతంగా ప్రోత్సహించారనే ఆరోపణలున్నాయి. అధికారులు కూడా కృష్ణమూర్తికి ప్రాధాన్యతనిచ్చేవారు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్‌ను పక్కన పెట్టుకుంటూనే సెంథిల్‌కుమార్‌ను వ్యతిరేక వర్గంగా మార్చారు. మదనపల్లెలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు 2024లో టికెట్ రాకుండా చేశారు. అత్యంత సీనియర్ ఎమ్మెల్యే అయినటువంటి పీలేరు చింతల రామచంద్రారెడ్డికి టీటీడీ బోర్డు మెంబర్ పదవి రాకుండా చేసి తమ అనుచరుడు పోకల అశోక్‌కుమార్‌కు వచ్చేలా చేశారు. తిరుపతి,చంద్రగిరిల్లోనూ ఆయన చాపకింద నీరులా వ్యవహరించేవారని అంటారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జగన్‌కు సన్నిహితంగా ఉండడం ఆయనకు మింగుడు పడేది కాదంటారు. చెవిరెడ్డి కూడా కొన్ని సందర్భాల్లో తన ప్రత్యర్థి పట్ల పెద్దిరెడ్డి ఎన్నడూ వ్యతిరేకంగా లేరని అనేవారు. తిరుపతి జిల్లాలో కూడా తనకు ప్రొటోకాల్ ఉండాలని తన నియోజకవర్గంలోని రొంపిచెర్ల,పులిచెర్ల మండలాలను తిరుపతిలో కలిపేందుకు పెద్దిరెడ్డి చేసిన ప్రయత్నాలను చెవిరెడ్డి అడ్డుకున్నారని అంటారు. తిరుపతిలోనే నివాసం ఉండే పెద్దిరెడ్డి తిరుపతి నగరంలోనూ, చుట్టుపక్కలా భూవ్యవహారాల్లో జోక్యం చేసుకునేవారు. సిటింగ్ ఎమ్మెల్యేకి ఇది ఇబ్బందిగా ఉన్నా జగన్‌తో వారికున్న పలుకుబడి వల్ల మౌనంగా భరించేవారని చెప్పుకుంటారు. మొత్తానికి ప్రతి నియోజకవర్గంలోనూ రాజకీయ పెత్తనం సాగించినందునే పెద్దిరెడ్డి కుమారుడు అరెస్టు పట్ల ఎక్కడా బలమైన నిరసనలు లేవని భావిస్తున్నారు.



తిరుమలలోనూ టీటీడీ పరిపాలనభవనం

బోర్డు సమావేశంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

- 142 మంది కాంట్రాక్ట్ డ్రైవర్ల క్రమబద్ధీకరణ
- బోర్డు నిర్ణయాలను వెల్లడించిన టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొత్తగా పరిపాలన భవనం నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. తిరుమలలో ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉన్న వివిధ విభాగాలను ఒకే తావులోకి తీసుకురావడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం తెలిపారు. అలాగే ఏపీ హైకోర్టు తీర్పు మేరకు టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్లుగా పనిచేస్తున్న 142 మందిని క్రమబద్ధీకరించేందుకు తీర్మానం చేశామనీ, దీనిని ప్రభుత్వ ఆమోదం కోసం పంపుతామని చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశం వివరాలను ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి చైర్మన్ మీడియాకు వివరించారు. బోర్డు నిర్ణయాల్లో కొన్ని ఇవీ..

- ఒంటిమిట్టలోని భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు రూ.4.35 కోట్లు కేటాయింపు.
- శ్రీవారిమెట్టు, అలిపిరి నడకమార్గాల్లో లైటింగ్, భద్రత పెంపు. ఆధ్యాత్మిక ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు.
- శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్, డీపీఆర్ రూపొందించాలని ఆదేశం.
- వివిధ దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక పై టీటీడీ సబ్ కమిటీ ఏర్పాటు. ఆ కమిటీ నివేదిక ప్రకారం తదుపరి చర్యలు.
- శ్రీవారిసేవను మరింత పటిష్టంగా అమలుచేసేందుకు కాంట్రాక్టు విధానంలో 4 కోఆర్డినేటర్ పోస్టుల భర్తీ.
- కల్యాణకట్టల్లో మరింత మెరుగైన వసతుల కోసం నిపుణులను సంప్రదించి కార్యాచరణ ప్రణాళిక.
- తిరుమలలో పాతబడి హెచ్‌వీడీసీలోని ఆరు బ్లాకులు, బాలాజీ విశ్రాంతి భవనం, ఆంప్రో గెస్ట్‌హౌస్, అన్నపూర్ణ క్యాంటీన్, కల్యాణి సత్రాలను ఐఐటీ నిపుణుల సూచనల మేరకు తొలగించాలని నిర్ణయం.
- వేదపారాయణం స్కీం ద్వారా ఇప్పటికే 1,430 మందికి ఏటా రూ.36 కోట్ల గౌరవ వేతనం ఇస్తున్నారు. తాజాగా మరో 700 మందికీ ఇవ్వాలని నిర్ణయం. దీనివల్ల టీటీడీకి అదనంగా రూ.18 కోట్ల భారం పడుతుంది. రాష్ట్రంలోని వారికే తొలి ప్రాధాన్యం.
- కడపలోని పురాతనమైన శివాలయం అభివృద్ధి.
- తాళ్లపాకలో పలు అభివృద్ధి కార్యక్రమాలు.

సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ప్రజాప్రతినిధుల జాతీయ సదస్సు

నేడు కలెక్టరేట్‌లో అధికారులతో స్పీకర్ సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా చట్టసభల జాతీయ మహిళ సాధికార సభ్యుల సదస్సు సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరగనుంది. ఈ సదస్సుకు వివిధరాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిదులు హాజరు కానున్నారు. ఈ సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 10గంటలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్షించనున్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులు పాల్గొననున్నారు. జాతీయ మహిళా సాధికార సభ్యుల సదస్సు కోసం తాజ్‌హోటల్‌ను వేదికగా ఎంచుకున్నట్టు సమాచారం. దాదాపు 500మంది ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ కమిటీ సభ్యులు అన్ని రాష్ట్రాల నుంచి పాల్గొంటున్నారు.

నేను సైతం..!

గూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న ఆమెకు అండగా నిలబడ్డారు. ఇల్లు కట్టించారు. ఆ తర్వాత ఇంటికొచ్చి మరీ ఎలా ఉన్నారంటూ పలకరించారు. ఇలా నేను సైతం.. అంటూ బాధితురాలికి ఆసరాగా నిలిచారు నటి మంచు లక్ష్మి. గూడూరు పట్టణం ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల సమీపంలోని ఉష ఇంటికి మంగళవారం మంచు లక్ష్మి వచ్చారు. 'ఎనిమిదేళ్ల కిందట నేను ఓ టెలివిజన్ షో నిర్వహించా. ఆ సమయంలో గూడూరుకు చెందిన ఉష తన భర్త చనిపోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు ఓ ప్రైవేటు కర్మాగారంలో పనులకు వెళ్లేది. ఓ రోజు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఆమెకు కాలు తీసేశారు. నా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. సమస్యను చెప్పింది. ఆమెకు ఆసరాగా నిలిచేందుకు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఖర్చులను నేను భరించా. ప్రస్తుతం ఉష ఎలా ఉన్నారో తెలుసుకునేందుకు వాళ్లింటికి వచ్చా'నని లక్ష్మి చెప్పారు. ప్రస్తుతం పేదలు చదివే పాఠశాలలను దత్తత తీసుకుని మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఆమెతో పాటు రవీంద్రరెడ్డి, వీరుబోయిన గోపాల కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉషతో మాట్లాడుతున్న మంచు లక్ష్మి

'జీరో వేస్ట్' జిల్లాగా మారుద్దాం

- కమిషనర్ కృషి, పారిశుధ్య కార్మికుల శ్రమతోనే తిరుపతికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు
- స్వచ్ఛత విజయోత్సవ సభలో మంత్రి అనగాని

తిరుపతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గార్బేజ్‌లో 'జీరో వేస్ట్' జిల్లాగా తిరుపతిని మారుద్దామని ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం జరిగిన స్వచ్ఛత విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు తిరుపతి నగరపాలక సంస్థ ఎంపికకావడం ఆనందంగా ఉందన్నారు. మన పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు. దేశంలోనే స్వచ్ఛతలో భాగంగా రాష్ట్రానికి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి మునిసిపాలిటీలకు స్వచ్ఛ అవార్డు రావడానికి పారిశుధ్య కార్మికులు చాలా కష్టపడ్డారని ప్రశంసించారు. తిరుపతిని అభివృద్ధి పథంలో తీసుకురావాలని కమిషనర్ మౌర్యకి సూచించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నగరంలో పారిశుధ్యం పడకేసిందని అటువంటి పరిస్థితి నుంచి ఇవాళ అవార్డు పొందటంలో కమిషనర్, సిబ్బంది కృషి ఎంతో ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. యూడీఎస్ నిర్మాణంతోపాటు కార్పొరేషన్ పరిపాలన భవనాన్ని పూర్తి చేసేందుకు సహకరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే పుణ్యక్షేత్రమైన తిరుపతిని ఉత్తమ స్థానంలో నిలపడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు కమిషనర్ మౌర్య తెలిపారు. సూపర్ స్వచ్ఛ లీగ్‌లో తిరుపతి రావడం గర్వకారణంగా ఉందన్నారు. పారిశుధ్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. తిరుపతి నగరంలో పోగుపడే 250 టన్నుల చెత్తను నిర్వహణ చేసి జీరో వేస్ట్ సిటీగా మార్చుతామన్నారు. గార్బేజ్ ఫ్రీ సిటీలో 7 స్టార్ రేటింగ్ సాధించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా అధికారులు, పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, ఏపీ జీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్త కళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, నాయీ బ్రాహ్మణ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఊకా విజయకుమార్, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, అనిత, రుద్రరాజు శ్రీదేవితో పాటు కుమారమ్మ, కరాటే చంద్ర, ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, ఆర్వో సేతుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న పారిశుధ్య కార్మికులతో మంత్రి అనగాని, ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు

ఆహార నాణ్యత పరీక్ష పరిశోధనశాల ప్రారంభం

తిరుమల, జూలై22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఏర్పాటు చేసిన ఆహార నాణ్యత పరీక్ష పరిశోధనశాలను మంగళవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు,ఈవో శ్యామలరావు ప్రారంభించారు. 'గతంలో స్వామి ప్రసాదాలు, నెయ్యి వంటి వస్తువుల నాణ్యతను పరీక్షించేందుకు ఇతర రాష్ట్రాలకు నమూనాలను పంపాల్సి వచ్చేది. ఇప్పుడు తిరుమలలోనే అత్యాధునిక పరికరాలతో నేరుగా పరీక్షలు నిర్వహించగలిగేలా ల్యాబ్‌ను తీర్చిదిద్దాం' అని చైర్మన్ తెలిపారు. ఈవో మాట్లాడుతూ నెయ్యిలో కల్తీ.. నాణ్యత శాతాన్ని తక్షణమే విశ్లేషించే సామర్థ్యంతో కూడిన జీసీ(గ్యాస్ కోమోటోగ్రాఫీ), హెచ్‌పీఎల్‌సీ(హై పెర్ఫామెన్స్ లిక్విడ్ కోమోటోగ్రాఫీ) వంటి పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. రూ.75 లక్షలు విలువైన ఈ పరికరాలను గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) విరాళంగా అందజేసిందన్నారు. ల్యాబ్ సిబ్బంది, పోటు కార్మికులు మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐలో ప్రత్యేక శిక్షణ పొందారని,ఇకపై స్వామివారి ప్రసాదాల నాణ్యతను ఇదే ల్యాబ్‌లో పరిశీలించి వెంటనే ఫలితాలు అందించేలా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్,సదాశివరావు, నరేష్, సీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒక క్లిక్

- రూ.3.51 లక్షలు హాంఫట్
- సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

తిరుపతి(నేరవిభాగం), జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఏపీకే ఫైల్‌పై చేసిన ఒకే క్లిక్.. బ్యాంకు ఖాతాల్లోని రూ.3.51 లక్షలను ఖాళీ చేసేసింది. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీకి చెందిన న్యాయవాది బాధితుడిగా మారారు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. ఆ న్యాయవాదికి గత నెల 19వ తేదీన 8640086400 నెంబరు నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. ఆ తర్వాత ఈయన సెల్‌ఫోనుకు ఏపీకే ఫైల్‌ను పంపారు. దీంతో ఏపీకే ఫైల్‌ను న్యాయవాది క్లిక్ చేశారు. అంతే.. అతడి మూడు బ్యాంకు ఖాతాల్లోని రూ.3.51 లక్షలను సైబర్ నేరగాళ్లు.. తమ ఎనిమిది అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. దీంతో న్యాయవాది ఫోను బ్లాక్ అయింది. వీటిపై మంగళవారం ఆయన తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ కేసు నమోదు చేశారు. సైబర్ నేరాలపై పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా తెలిసీ తెలియక ఇలా ఎందరో మోసపోతున్నారు.

అమ్మవారి సేవలో మంత్రి జనార్దన్‌రెడ్డి



ఆలయం వద్ద మంత్రి జనార్దన్‌రెడ్డి

తిరుచానూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారిని మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి నమస్కరించి, అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ

ముగిసిన కనకదుర్గమ్మ ఆలయ ఉత్సవాలు



విశేషాలంకరణలో కనకదుర్గమ్మ

చంద్రగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసమంగాపురం కనకదుర్గమ్మ ఆలయంలో వార్షిక ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు సాయంత్రం అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఊయలలో అధిష్ఠించారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన సింగు వంశస్తులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



చంద్రగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పనపాకం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకుడు మరుపూరి హేమశేఖర్ నాయుడు, దివ్యాంగ సేవా కేంద్రం వ్యవస్థాపకుడు నెల్లూరి మునిలక్ష్మి సంయుక్త ఆధ్వర్యంలో రూ.10వేలు విలువైన విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అలాగే పాఠశాలకు కొటాల గ్రామానికి చెందిన ఎస్.బేబికుమారి, ఎన్‌ఆర్‌ఐ పునీత్‌చౌదరి, వి.నరేష్‌లు రూ.20 వేల విలువైన నీటి మోటర్, పైపులైన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి నారాయణ, ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తనపల్లెలో పీ4గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న సెక్రటరీ సాయిశ్రీ

తిరుపతిరూరల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): తనపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం పీ4 గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సాయిశ్రీ మాట్లాడుతూ.. ఇటీవల పంచాయతీల్లో నిర్వహించిన సర్వేలో 173మంది(బంగారుకుటుంబాలు)పేదలు, ఏడుగురు దాతలను గుర్తించామన్నారు. దీనిపై స్పందించిన కొందరు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ఏ ఆధారంలేని నిరుపేదలు ఇంకా కొందరు ఉన్నారని, వారిని గుర్తించాలని కోరారు. దీనిపై స్పందించిన కార్యదర్శి మాట్లాడుతూ పూర్తి స్థాయిలో విచారించి చివరిగా అర్హులైన పేదలను ఎంపిక చేస్తామని వివరించారు. కాగా ఇంటింటికీ వచ్చే చెత్తసేకరణ సిబ్బందికి తడి, పొడి చెత్తలని వేర్వేరుగా అందించాలని కోరారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, కాయం సుబ్రమణ్యంరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూతో అప్రమత్తంగా ఉండాలి



భాకరాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భాకరాపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డెంగ్యూ నివారణ సబ్-యూనిట్ అధికారి శివయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'పరిశీలించండి-శుభ్రం చేయండి-మూతలు పెట్టండి' అనే పద్ధతుల ద్వారా డెంగ్యూను నివారించవచ్చునన్నారు. దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలు ఉన్నాయేమోనని పరిశీలించి శుభ్రం చేయాలన్నారు. నీరు నిల్వ ఉండే తొట్టెలు, డబ్బాలపై మూతలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి తేజస్విని, సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ వెంకటేశులు

భాకరాపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలస్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ వెంకటేశులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చే ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి వారికి సమాధానాన్ని ఇవ్వాలన్నారు. రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. దరఖాస్తు అందిన 30 రోజుల్లోపు అర్జీదారుడికి సమాచారం ఇవ్వాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్వీయూ కన్స్యూమర్ స్టోర్స్ పీఐసీగా సురేష్‌బాబు

తిరుపతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీయూ కన్స్యూమర్ కోఆపరేటివ్ స్టోర్స్‌కు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా చంద్రగిరి సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ వి.సురేశ్ బాబు నియమితులయ్యారు. ఇదివరకూ ప్రభుత్వం ఈ స్థానంలో నియమించిన ఉద్యోగి పదవీ కాలం ఈ ఏడాది డిసెంబరు 7వ తేదీ దాకా ఉంది. అయితే సాధారణ బదిలీల్లో భాగంగా సంబంధిత ఉద్యోగి మరో ప్రాంతానికి బదిలీ కావడంతో ఈ నియామకం అనివార్యమైంది. దానికనుగుణంగా సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 11 నుంచి ఈ ఏడాది డిసెంబరు 7 దాకా సురేశ్‌బాబు సంబంధిత పోస్టులో కొనసాగనున్నారు.

చంద్రగిరి

నేడు మండల మీట్

ఎర్రావారిపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వ సభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మదన్‌మోహన్ రాజు తెలిపారు. ఈ మేరకు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమాచారం పంపినట్లు పేర్కొన్నారు. సమావేశం వెలుగు కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు.

హెచ్‌డీపీపీ కార్యక్రమాల బ్రోచర్ ఆవిష్కరణ

తిరుమల, జూలై22(ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కార్యక్రమాల బ్రోచర్‌ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు బోర్డు సభ్యులతో కలిసి మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఆవిష్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు పలు కార్యక్రమాలను రూపొందించామన్నారు. ఈనెల 28న సద్గమయ, ఆగస్టు 8 నుంచి ప్రత్యేక సౌభాగ్యం, 15న సన్మార్గం, 31న హరికథా వైభవం, అక్టోబరు 2న అక్షర గోవిందం, డిసెంబరు 1 భగవద్గీతానుష్ఠానం-బోధన, 2026 వేసవి సెలవుల్లో 16 ఏళ్ల వయస్సులోపు పిల్లలకు సంప్రదాయ భజన శిక్షణ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. వీటితో పాటు వన-నిధి, గిరిజనార్థం వంటి కార్యక్రమాలను రూపొందిస్తున్నా మన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



ద్రౌపదీ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రామచంద్రాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ద్రౌపదీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ద్రౌపదీ సమేతధర్మరాజుల ఉత్సవమూర్తులను అలంకరించి కల్యాణ వేదికకు తీసుకువచ్చారు. అక్కడ వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్ల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలుగా మాజీ వైస్ ఎంపీపీ తేజోవతి, టీడీపీ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి దంపతులు వ్యవహరించారు. అంతకుముందు భాగవతారిణి అనసూయ విరాటపర్వంలోని కీచకవధను రమ్యంగా వినిపించారు. సాయంత్రం మేళతాళాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగించారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై సీఎం సమీక్ష



సీఎం సమీక్షకు హాజరైన కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), జూలై 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాలపై సీఎం చంద్రబాబు అమరావతి నుంచి మంగళవారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షకు హాజరయ్యారు. వ్యవసాయ రంగ అభివృద్ధిపై కూలంకషంగా సమీక్షించారు. మామిడి కొనుగోలుపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు.

భూమి రెగ్యులైజేషన్‌కు కృషి

పార్టీ క్లస్టర్ సమావేశాల్లో ఎమ్మెల్యే నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఎర్రావారిపాలెం, జూన్ 22(ఆంధ్రజ్యోతి) : 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న డీకేటీ భూములను అనుభవదారుల పేరిట రెగ్యులైజేషన్ చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల టీడీపీ గ్రామ క్లస్టర్ స్థాయి సమాశేశాలు పాకాల మండలం పులివర్తివారిపల్లెలో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎర్రావారిపాలెం మండలంలో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట గ్రామ సర్వే నెంబరు 329 ఆక్రమణలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మాతమ్మ, సీతారాముల ఆలయాల నిర్మాణాలకు ఆర్థికసాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తొలి అడుగు కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే పథకాల అములులో లోటుపాట్లను గుర్తించాలన్నారు. పార్టీ మండలాధ్యక్షులు బెల్లంకొండ మురళి, దేశిరెడ్డి రఘునాథ, కార్యదర్శులు మదన్, మహేష్ నాయుడు, మోహన్ రెడ్డి, మధు, సుబ్రమణ్యం, దామోదర్, సుబ్రమణ్యం, రమణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివరామిరెడ్డి, అక్కీదేవి, దేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానికి మంత్రి పరామర్శ



లక్ష్మీభారతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యప్రసాద్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

పాకాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నానీని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే తల్లి లక్ష్మీభారతి మృతిచెందిన నేపథ్యంలో మండలంలోని పులివర్తివారిపల్లెలో నానిని కలిశారు. లక్ష్మీభారతి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నానీని, కుటుంబసభ్యులను పరామర్శించారు.

స్పీకర్, మంత్రులకు స్వాగతం



స్పీకర్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

తిరుపతి, జూలై22(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పర్యటనకు వచ్చిన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్‌లకు మంగళవారం రేణిగుంట విమానాశ్రయంలో టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు జేబీ శ్రీనివాస్, మహేష్ యాదవ్, పుష్పావతి యాదవ్‌లు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన లక్ష్మీకుబేర హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న శాంతి గిరిజనాప్రభువు

రామచంద్రాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రామాపురం బ్రహర్షిపీఠంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న లక్ష్మీకుబేర హోమం మంగళవారం పూర్ణాహుతితో ముగిసింది. లక్ష్మీనారాయణ ఆలయంలో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9గంటలకు 108 యజ్ఞకుండాల వద్ద వేదపండితులు లక్ష్మీ కుబేర హోమాన్ని నిర్వహించగా 12 గంటలకు మహారాష్ట్రకు చెందిన ఆధ్యాత్మిక గురువు శాంతి గిరిజనా ప్రభువు పూర్ణాహుతితో ముగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కోటిలింగేశ్వరస్వామి సేవలో ఉపకేద్ ఆశ్రమ పీఠాధిపతి



కామాక్షి అమ్మవారిని దర్శించుకుంటున్న శ్రీపాదానంద

రామచంద్రాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట కామాక్షి సమేత కోటిలింగేశ్వరస్వామిని మహారాష్ట్ర ఉపకేద్ ఆశ్రమ పీఠాదిపతి శ్రీపాదనంద మంగళవారం శిష్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీపాదానంద కోటి లింగేశ్వరస్వామికి స్వయంగా అభిషేకం నిర్వహించి, కామాక్షి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తంజావూరు మురళీకృష్ణ, టీటీడీ విశ్రాంత ఉద్యోగి భాస్కర్‌నాయుడు, ఇన్‌కంట్యాక్స్ విశ్రాంత అసిస్టెంట్ కమిషన్ ఏపీ నాయుడు, దేవరాజులునాయుడు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా హరినాథ్‌రెడ్డి



రామచంద్రాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యదర్శిగా రామచంద్రాపురం మండలం నడవలూరుకు చెందిన కాయం హరినాథరెడ్డి నియమితులయ్యారు. ఆయన 1998 నుంచి పార్టీలో పనిచేస్తున్నారు. పలు పదవులను అలంకరించారు. ఉమ్మడి జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేశారు. దీంతో రెండవసారి జిల్లా కార్యదర్శిగా నియమించారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

కమిషనర్‌కు బీజేపీ నేతల అభినందనలు



కమిషనర్ మౌర్యకు అభినందనలు తెలియజేస్తున్న వరప్రసాద్

తిరుపతి (ఉపాధ్యాయనగర్), జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు సాధించేలా తిరుపతిని తీర్చిదిద్దినందుకు గాను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్యను బీజేపీ నాయకులు అభినందించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ మరికొందరు పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు.



తనపల్లెగ్రామంలో రోడ్లపై నిలచిన వర్షపునీరు

రోడ్లపై వర్షపు నీరు

తిరుపతిరూరల్, జూలై22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లెలో చినుకుపడితే వర్షపునీరు పలుచోట్ల రోడ్లపై నిల్వ చేరుతోంది. గ్రామంలో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఈ నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా రెండుమూడు రోజులపాటు అలాగే నిలిచిపోతోందని గ్రామస్తులు అంటున్నారు. ఈ నీటిలో దోమలు వృద్ధి చెంది అనారోగ్యం బారిన పడుతున్నామని, ఈ మార్గంలో నడిచేందుకు కూడా ఇబ్బందిపడుతున్నామని వాపోతున్నారు. గ్రామంలో దాదాపు 15సంవత్సరాల కిందట వేసిన సిమెంటు రోడ్లు కావడంతో మిట్టపల్లాలుగా తయారయ్యాయని, దీంతో చిన్నపాటి వర్షానికి కూడా నీరు నిలిచిపోతోందని అంటున్నారు. పంచాయతీ అధికారులు ఈ దిశగా చొరవచూపి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ముగ్గురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● పిడిలేని గొడ్డళ్లు, రంపాలు, వంట సామగ్రి, కారు స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఖాజీపేట అటవీప్రాంతంలో మంగళవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి పిడిలేని గొడ్డళ్లు, రంపాలు, వంట సామగ్రితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్సీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఐ మురళీధర్‌రెడ్డి బృందం పొద్దుటూరు రేంజ్‌లోని ఖాజీపేట సెక్షన్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా కన్నెల వాగు వద్ద ఒక కారులో నుంచి కొంతమంది వ్యక్తులు దిగుతుండటాన్ని టాస్క్‌ఫోర్సు పోలీసులు గమనించారు. పోలీసులను గమనించిన వారు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని వెంబడించి ముగ్గురిని పట్టుకున్నారు. పట్టుబడిన వారు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. వారి నుంచి కారులో పిడిలేని మూడు గొడ్డళ్లు, మూడు రంపాలు, మూడు బ్యాగులు, వంట చేసుకున సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోజాకు ఎంత మంది కొడుకులో..! : కిరణ్‌రాయల్



తిరుపతి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రోజాకు ఎంతమంది కొడుకులో తెలియడం లేదని జనసేన నేత కిరణ్ రాయల్ అన్నారు. ఆమె మాటలు వింటుంటే వందలాది మంది కొడుకులు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. జైలుకు వెళ్లడానికి రోజులు లెక్కపెట్టుకోవాలని సూచించారు. హరిహర వీరమల్లు సినిమా విడుదల నేపథ్యంలో తిరుపతిలో మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సినిమాపై వైసీపీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోందని, సినిమా విడుదల తరువాత వారికి అసలు సినిమా చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుభాషిని, బాబ్జీ, మనోజ్, కిషోర్, ప్రదీప్, సుజిత్, రాధ, వినోద్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

● 650 గ్రాముల స్వాధీనం



తిరుపతి(నేరవిభాగం), జూలై 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న స్మగ్లర్‌ను మంగళవారం తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి దాదాపు 650 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నరసనాయుడు కథనం మేరకు..తనపల్లి ఇందిరమ్మ ఇళ్లలోని బ్లాక్ నెంబరు 68లో ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి ఆదేశాలతో ఏఈఎస్ వాసుదేవ చౌదరి నేతృత్వంలో టాస్క్‌ఫోర్సు బృందాలు, రూరల్ ఎక్సైజ్ సీఐ నరసనాయుడు, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్యాం ప్రసాద్, ఎస్ఐ కప్పేశ్వర నాయుడు, ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్ఐ స్వామినాధన్, సిబ్బంది కలసి దాడులు చేశారు. ఈ దాడుల్లో గంజాయి విక్రయించడానికి సిద్ధంగా ఉంచుకున్న కుట్టి సతీష్‌ను అరెస్టు చేశారు. ఇతనికి గంజాయి సరఫరా చేసే భాగ్యరాజ్, మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఇద్దరిపై గతంలోనూ కేసులు వున్నాయని, కుట్టి సతీష్ 2023లో చంద్రగిరి స్టేషన్‌లో, భాగ్యరాజ్‌పై 15 రోజుల క్రితం తిరుచానూరు స్టేషన్‌లో గంజాయి కేసులు నమోదయ్యాయని సీఐ చెప్పారు. ఈ దాడుల్లో రూరల్ ఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుల్స్ మంజునాధ నాయుడు, రమేష్, కానిస్టేబుళ్ళు వేణుగోపాల్, మునిరెడ్డి, డేవిడ్, రూప్‌కుమార్‌లు పాల్గొన్నారు.

మతం, దేవుడు వ్యక్తిగతంగానే ఉండాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 22(ఆంధ్రజ్యోతి): మతం, దేవుడు వ్యక్తిగతంగానే ఉండాలని భారత హేతువాదసంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య అభిప్రాయపడ్డారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పుటపర్తి సాయిబాబా శతజయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలని జీవో నెంబరు 862 తీసుకురావడం రాష్ట్రప్రజలను అవమానించడమే అన్నారు. ఆ జీవోను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. చిన్నం పెంచులయ్య, అనసూయ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ మెకానిక్స్, ఎలక్ట్రీషియన్స్‌కు ప్రత్యేక శిక్షణ



శిక్షణ ఇస్తున్న సూర్యనారాయణ

తిరుపతి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల ఘాట్‌లో నడిచే బస్సులను ముస్తాబు చేయడానికి మెకానిక్స్, ఎలక్ట్రీషన్స్‌కు మంగళవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డీపీటీవో కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణకు వివిధ సంస్థల నుంచి సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. ఘాట్ బస్సుల నిర్వహణ, రిపేర్లు, బ్రేక్, స్టీరింగ్, ఎలక్ట్రిక్, ఇంజన్, గేర్ తదితరాలకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చారు. సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ బాలాజీ, ప్రభాకర్, చాందినీ, 11 డిపోల నుంచి మెకానిక్స్, ఎలక్ట్రీషన్స్ పాల్గొన్నారు.

వీరమల్లు విజయవంతం కావాలని బైక్ ర్యాలీ



తిరుపతి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన హరిహరవీరమల్లు సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మంగళవారం ఉదయం నగరంలో బైక్‌ర్యాలీ కోలాహలంగా నిర్వహించారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో జనసైనికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పూలే విగ్రహం వద్దకు చేరుకున్నారు. బ్యానర్లు, జెండాలు పట్టుకుని ర్యాలీ ప్రారంభించారు. టౌన్‌క్లబ్, కృష్ణాపురంఠాణా, నాలుగుకాళ్ల మండపం, గ్రూప్‌థియేటర్స్ వద్దకు చేరుకున్నారు. సినిమా గొప్ప విజయం సాధించాలని, గత రికార్డులన్నీ బద్దలు కొట్టాలని ఆకాంక్షించారు. కార్పొరేటర్లు వినోద్‌రాయల్, పగడాల మురళి పాల్గొన్నారు.

ముంబై స్టడీ టూర్‌కు తిరుపతి పారిశుధ్య సిబ్బంది

తిరుపతి, జూలై22(ఆంధ్రజ్యోతి) : నేవీ ముంబైలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ అవగాహన కార్యక్రమానికి తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన 50 మంది పారిశుధ్య కార్మికులు వెళ్లారు. మంగళవారం సాయంత్రం బయలుదేరిన వీరు మూడు రోజులు పాటు ముంబైలో పారిశుధ్య పనులను పరిశీలించి వస్తారని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తెలిపారు. ఆ విషయాలను తిరుపతిలో అమలు చేసి నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు వీలుంటుందన్నారు.

నారాయణలో ఘనంగా క్యాబినెట్ వేడుక



నూతన క్యాబినేట్‌తో ఏజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ అంసవేణి

తిరుపతి(విద్య), జూలై 22(ఆంధ్రజ్యోతి): మంగళంలోని నారాయణ పాఠశాలలో క్యాబినెట్ ఏర్పాటు వేడుకను ఘనంగా నిర్వహించారు. కేబినేట్ ఏర్పాటు కోసం ఇటీవల పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఆ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. నారాయణ పాఠశాలల ఏజీఎం శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. గెలుపొందిన విద్యార్థులతో ఏర్పాటైన పాఠశాల నూతన క్యాబినేట్‌ను అభినందించారు. ఏజీఎం మాట్లాడుతూ.. పాఠశాల స్థాయినుంచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందిం చేందుకుగాను ఏటా ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంసవేణి, కోఆర్డినేటర్లు శ్రీకాంత్, గాయత్రి, ఆర్‌ఎస్‌టీ సాయికృష్ణ, అకడమిక్ డీన్ వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ అనూష పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫిలాసఫీ పరిశోధకులు వి.శివకేశవర్ధన్ డాక్టరేట్ పొందారు. మహాత్మాగాంధీ వ్యూస్ ఆన్ హ్యూమన్ ప్రెడికమెంట్ అండ్ ద సొల్యూషన్- ఎ స్టడీ అంశంపై డాక్టర్ శ్రీనివాసులు నాయక్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

స్వయం కోర్సు రద్దు చేయండి: ఎస్ఎఫ్ఐ



ఆందోళన చేపడుతున్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్వయం కోర్సు రద్దు చేయాలని కోరుతూ ఎస్వీయూలో ఎస్ఎఫ్ఐ ఆందోళన చేపట్టింది. పరిపాలనా భవనం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ, జీఎన్ఎస్ సంఘాలు ఇందులో పాల్గొన్నాయి. అంతకు ముందు తరగతులు బహిష్కరించి, యూనివర్సిటీలో ర్యాలీ నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ స్వయం కోర్సుతో విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. స్వయం కోర్సు స్థానంలో పాత పద్ధతిలో ఇతర సబ్జెక్టులను ఓపెన్ ఎలక్టివ్‌గా పెట్టాలని కోరారు. విద్యార్థులకు ఈ విషయంలో వెసులుబాటు ఇవ్వాలని సూచించారు. అధికారులు విద్యార్థుల దగ్గరకు వచ్చి సమస్యను తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, అశోక్, వినోద్, తేజ, జీఎన్ఎస్ అధ్యక్షుడు శివశంకరనాయక్, గీతాంజలి, తిరుమలేష్, భాను, చక్రి పాల్గొన్నారు.

కాన్వొకేషన్ నిర్వహించండి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కాన్వొకేషన్ నిర్వహించాలని ఎస్వీయూ అధికారులను గిరిజన నవ సమాజ్ కోరింది. ఈ మేరకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడిని సంఘం అధ్యక్షుడు శివశంకర్‌నాయక్ విన్నవించారు. 2022 తర్వాత కాన్వొకేషన్ నిర్వహించలేదన్నారు. కోర్సులు పూర్తి చేసుకున్న వారు కాన్వొకేషన్ తీసుకోవాలంటే, ఇన్ అడ్వాన్స్ పద్ధతిలో ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. వెంటనే కాన్వొకేషన్ నిర్వహించి విద్యార్థులకు మేలు చేయాలని కోరారు.

కోదండరామాలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుపతి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాల అనంతరం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం, భాష్యకార్ల గుడి వద్ద శాత్తుమొర జరిగాయి. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి కావించారు. ఉత్సవమూర్తులను, ప్రధాన కుంభాన్ని విమాన ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేసి కుంభావాహన క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఈ ఉత్సవంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

నగర నాయీబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడిగా జయకుమార్



జయకుమార్ - దాము - శివ

తిరుపతి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా ఎస్.జయకుమార్ గెలుపొందారు. మంగళవారం స్థానిక యూత్ హాస్టల్లో సంఘం ఎన్నికలు నిర్వహించారు. 530 ఓట్లకు గాను 376 పోలయ్యాయి. ఆవుల రాఘవపై 102 ఓట్ల మెజారిటీతో జయకుమార్ విజయం సాధించారు. కార్యదర్శిగా గల్లా దాము, కోశాధికారిగా ఉప్పలపాటి శివ గెలుపొందారు. ఎన్నికల అధికారులుగా జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సురేంద్ర, సీనియర్ జర్నలిస్టు ద్వారక, నగర గౌరవాధ్యక్షుడు రామనారాయణ వ్యవహరించారు.

మానవీయ విలువలు చాటిన దేవరాగం



దేవరాగం నాటకంలోని దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు చెందిన సౌజన్య కళా స్రవంతి ఆధ్వర్యంలో 'దేవరాగం' సాంఘిక నాటిక ప్రదర్శన సాగింది. కొన్ని రోజులుగా మహతి కళాక్షేత్రంలో నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అభినయ ఆర్ట్స్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కనుమరుగవుతున్న మానవీయ విలువలు, రక్త సంబంధాలు ఎడబాటుకు గురికావడం వంటి అంశాలను దేవరాగం నాటకం దృశ్యమానం చేసింది. ఈ నాటకాన్ని సలీం రాశారు. దర్శకులుగా కేకేఎల్ స్వామి వ్యవహరించారు. ఆదికవి నన్నయ పద్య నాటక ప్రదర్శన ఆద్యంతమూ ఆకట్టుకుంది. విజయనగరానికి చెందిన శ్రీశ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'నన్నయ భట్టు' అనే పద్య నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ నాటకాన్ని శారదాప్రసన్న రాయగా, కేడీఆర్ గాంధీ దర్శకత్వం వహించారు. నన్నయ జీవిత, సాహిత్య విశేషాలను ఈ నాటకం దృశ్యమానం చేసింది. అంతకు ముందు సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. కళాభిమానులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి



డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై22(ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన వినతులను తక్షణమే పరిష్కరించాలని, నగరంలో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారు లను ఆదేశించారు. మంగళవారం ఉదయం మధురా నగర్‌లోని డ్రైనేజీ కాలువలను, రోడ్లను ఆమె పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మధురా నగర్‌లో ప్రజలకు ఇబ్బందిగా లేకుండా డ్రైనేజీల్లో చెత్త తొలగించి, నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో నిర్మాణంలో ఉన్న భవనాల అనుమతులను ప్లానింగ్ అధికారులు పరిశీలించాలని, నిబంధనలకు విరుద్ధంగా జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, డీసీపీ ఖాన్, డీఈ రమణ, శిల్ప, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

తోపుడుబండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులివ్వాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న తోపుడు బండ్ల వ్యాపారులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని తోపుడు బండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. తోపుడు బండ్ల వ్యాపారుల సంఘం (సీఐటీయూ అనుబంధం) 7వ నగర మహాసభల సందర్భంగా పాత మున్సిపాలిటీ కార్యాలయం నుంచి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ నగరంలో తోపుడు బండ్ల వ్యాపారుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వారి రక్షణ కోసం 2014లో పార్లమెంట్‌లో చేసిన చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనల పేరుతో వారిపై పోలీసుల దౌర్జన్యాలను అరికట్టాలని కోరారు. అక్రమ కేసులు బనాయిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సభలో నాయకులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, మాధవ్, వేణుగోపాల్, బుజ్జి, ఎం.రాజు, ప్రసాద్, దాము, మురళి, రామాంజులు, శోభ, మంజుల, రత్నమ్మ పాల్గొన్నారు.

టీటీడీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

తిరుపతి(ఆటోనగర్), జూలై22(ఆంధ్రజ్యోతి): టీటీడీలోని 13 వేల ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ టీటీడీలో కొన్నేళ్లుగా ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం బాధాకరమన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి టీటీడీకి, ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పైగా అన్యమతస్తుల పేరుతో ఉద్యోగులను తొలగించడం అన్యాయమన్నారు. ఏటా లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని, లేకపోతే నిరుద్యోగ భృతి అందజేస్తామని చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నాయని విమర్శించారు. తీరు మార్చుకోకపోతే ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ నాయకులు నాగార్జున, రామకృష్ణ, మల్లికార్జున్, మురళి, నాగరాజు, పూర్ణ పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య



అశోక్‌కుమార్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), జూలై 22(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక తిరుపతి రూరల్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రూరల్ మండలం సాయినగర్‌లో చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. తిరుపతి రూరల్ తనపల్లికి చెందిన రామసముద్రం చంద్రబాబు కుమారుడు అశోక్‌కుమార్(23) ఇంటర్ వరకు చదివి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ భారీ మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. అప్పు తీసుకున్న వారికి అతని తండ్రి రూ.2 లక్షల వరకు చెల్లించాడు. అయినా అశోక్‌కుమార్ గేమ్‌లు ఆడడం మానలేదు. మళ్లీ అప్పులు చేస్తుండడంతో తండ్రి చీవాట్లు పెట్టాడు. మనస్తాపానికి గురై ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతని చిన్నాన్న కుమారుడు రాజా వచ్చి తలుపులు తట్టినా తీయక పోవడంతో కిటికీలో నుంచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. రాజా వెంటనే స్నేహితులతో కలిసి తలుపులు పగులగొట్టి అశోక్ కుమార్‌ను చికిత్స నిమిత్తం రుయాకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు ధ్రువీకరించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విగ్రహం ధ్వంసం కేసులో నిందితులను అరెస్టు చేయాలి



అదనపు ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నేతలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 22(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె బుద్ధుడి కొండపై ఉన్న బుద్ధుడి విగ్రహం తలను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరాచారికి విన్నవించారు. నాయకులు పరమశివం, పి.అంజయ్య, గోపి, మేడికొండ ప్రసాద్‌రావు, రమేష్, నాగయ్య, రామ్మూర్తి, మల్లికార్జునరెడ్డి, గిరి మాట్లాడుతూ బుద్ధుడి విగ్రహం తల ధ్వంసం చేసిన ఘటన యావత్ రాష్ట్రాన్ని కలచివేసిందన్నారు. నిందితుడిని ఇప్పటివరకు గుర్తించి అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. పైగా విగ్రహాన్ని ప్రతిష్ఠించిన వారిపైనే కేసులు బనాయించాలని చూడడం మంచి పద్ధతి కాదన్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, తప్పుడు కేసులు ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

హెల్మెట్లు ధరించని 72 మందికి జరిమానా



తిరుమల, జూలై22 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్లలో హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న 72 మంది ద్విచక్ర వాహనదారులకు రూ.72వేల జరిమానా విధించారు. తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించడంతో పాటు హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

పబ్లిక్ హెల్త్ ఈఈలుగా ముగ్గురికి పదోన్నతి

తిరుపతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖలో జిల్లా నుంచి ముగ్గురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ప్రభుత్వం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 29 మంది డీఈలకు పదోన్నతి లభించగా అందులో జిల్లాకు చెందిన అధికారులు ముగ్గురు ఉన్నారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో డీఈగా పనిచేస్తున్న ఎస్ఎండీ రఫి పదోన్నతిపై విజయవాడలోని అపిట్కో (ఏపీటీఐడీసీవో)లో ఈఈగా నియమితులయ్యారు. పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో డీఈగా ఉన్న టి.చంద్రశేఖర్‌రెడ్డి చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి ఈఈగా నియమితులయ్యారు. వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో డీఈగా ఉన్న ఎన్.విష్ణు మూర్తి పదోన్నతిపై ఈఈగా గుంటూరు కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రకాశించిన ప్రతిభ..!

● ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ మేగజైన్ 'ఆరా' ఆవిష్కరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ మేగజైన్ (ఆరా)ను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ సుధారాణి మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రకాశం భవన్ కేంద్రంగా ఉందన్నారు. యూనివర్సిటీ కోసం ప్రకాశం పంతులు ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆర్ట్స్ కాలేజీ పరిధిలోని వివిధ విభాగాల విద్యార్థుల కవితలు, కథలు, వ్యాసాలు, పెయింటింగ్ తదితర సృజనాత్మక అంశాలు ఈ మేగజైన్‌లో ప్రచురించినట్టు చెప్పారు. ఈ మేగజైన్‌కు ఆరా అనే పేరు పెట్టారని, దానికి ప్రకాశించు అనే అర్థం వస్తుందని అన్నారు. ఈ మేగజైన్ ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించినట్టు అవుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి, మేగజైన్ కమిటీ సభ్యులు ఆచార్య రాజేశ్వరమ్మ, ఆచార్య సుమకిరణ్, ఆచార్య ప్రయాగ, ఆచార్య అమీనుల్లా, ఓబులేశు, రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి - ప్రమోదదేవి, కృష్ణదత్త చామరాజ్ వడియార్ - స్వప్న దత్

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వేకువజాము సుప్రభాత సేవలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకోగా, ఉదయం వీఐపీ బ్రేక్‌లో దర్శనం చేసుకున్నవారిలో మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదదేవి, మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్, సినీ నిర్మాత స్వప్న దత్, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, ధన్‌పాల్ సూర్యనారాయణ ఉన్నారు. దర్శనం అనంతరం మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదదేవి, మహారాజు కృష్ణదత్త మీడియాతో మాట్లాడుతూ.. పల్లవోత్సవం సందర్భంగా తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తరతరాలుగా తమ వంశీకులందరూ స్వామి సేవలో తరిస్తున్నారని చెప్పారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

'దండోరా' చేస్తున్నా: నందు



తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నటుడు శివాజీతో కలిసి 'దండోరా' అనే చిత్రంలో నటిస్తున్నట్లు హీరో నందు తెలిపారు. శివాజీ తన తండ్రి పాత్రలో నటిస్తున్నారని వెల్లడించారు. తిరుమల శ్రీవారిని ఆయన మంగళవారం దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'అగ్లీ స్టోరీ' అనే మరో చిత్రంలోనూ నటిస్తున్నట్టు చెప్పారు. నిర్మాతగా తాను తీయబోతున్న చిత్రంలో పెద్ద హీరో నటిస్తున్నారని, ఆగస్టు మొదటి లేదా రెండవ వారంలో ఆ చిత్రానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.96 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,481

తలనీలాలు సమర్పించినవారు: 30,612

'నిసార్' సిద్ధం



ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన 'నిసార్' ఉపగ్రహం షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా ఈ నెల 30న ఎగిరేందుకు సిద్ధమైంది. రెండు రోజుల క్రితం షార్‌లోని శాటిలైట్ ప్రిపరేషన్ బిల్డింగ్ నుంచి ఉపగ్రహాన్ని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పచ్చజెండా ఊపి రెండో ప్రయోగ వేదిక వద్దనున్న వ్యాబ్‌కు తరలించారు. అక్కడ రాకెట్ మూడు దశల అనుసంధాన పనులు, రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఈ ఫొటోలను ఇస్రో మంగళవారం విడుదల చేసింది. మరో రెండు రోజుల్లో వ్యాబ్ నుంచి రెండో ప్రయోగ వేదికకు రాకెట్‌ను తరలించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



వాణిజ్య పన్నుల శాఖ సర్కిల్ కార్యాలయం తరలింపునకు అనుమతి

తిరుపతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ శ్రీకాళహస్తి సర్కిల్ కార్యాలయాన్ని పుత్తూరు నుంచీ శ్రీకాళహస్తికి తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. శ్రీకాళహస్తి కేంద్రంగా పనిచేయాల్సిన సర్కిల్ కార్యాలయం పాలనా కారణాలతో పుత్తూరులో నడుస్తోంది. అక్కడి నుంచీ శ్రీకాళహస్తి పానగల్ ప్రాంతానికి కార్యాలయాన్ని తరలించేందుకు అనుమతి కోరుతూ శాఖ చీఫ్ కమిషనర్ ఈ ఏడాది ఫిబ్రవరి 28న లేఖ రాశారు. దానిపై స్పందించిన శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ కార్యాలయం తరలించేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కమనీయం కుమారస్వామి కల్యాణం



గజవాహనంపై ఊరేగుతున్న శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి

శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి కల్యాణం మంగళవారం రాత్రి కమనీయంగా సాగింది. శ్రీకాళహస్తి పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కుమారస్వామికి, శ్రీవల్లీ, దేవసేనకు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. అక్కడ నుంచి మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య కుమారస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో డిజిటల్ ఫైళ్లు !

తిరుపతి(నేరవిభాగం), జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఫైళ్ళ నిర్వహణకు సంబంధించి పారదర్శకత ఎస్పీ హర్షవర్ధన రాజు డిజిటల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో పోలీసు అధికారులు, పోలీసులు, సిబ్బందికి అవసరమైన పనులు ఎప్పటికప్పుడు సత్వరం పరిష్కరించడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. ఈ విధానం ద్వారా పోలీసు సిబ్బంది వారి వ్యక్తిగత ఫైళ్ళ పురోగతిని సులభంగా తెలుసుకోవడానికి ప్రత్యేకంగా 9440900737 మొబైల్ నెంబరు ఏర్పాటు చేశారు. పారదర్శకత, దక్షణ, ఫైళ్ల పరిష్కారంలో వేగవంతం కోసం ఈ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఇంక్రిమెంట్లు, లీవులు, లీవు రెగ్యులరైజేషన్, జీపీఎఫ్ రుణాలు, అరియర్లు, ట్రాన్స్‌ఫర్లు, డెప్యుటేషన్లు, మెడికల్ రీఎంబర్సుమెంటు, భద్రత రుణాల మంజూరు తదితర విషయాల్లో తమకు సంబంధించిన ఫైళ్ళు ఎలా కదులుతున్నాయి? అనే సమాచారం సిబ్బందికి తెలియకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. డిజిటల్ వ్యవస్థతో ఫైల్ ప్రతి దశలో పురోగతిపై సమాచారం వాట్సాప్ ద్వారా ఆయా ఉద్యోగులకు అందుతుంది. అధికారులు, సిబ్బంది తమకున్న సమస్యలు, అభ్యంతరాలను మొబైల్ నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపొచ్చు. ఈ ప్రక్రియ మొత్తం జిల్లా పోలీసు అధికారి పర్యవేక్షణలో జరుగుతుంది.

ఆగస్టు 15నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలి

● పీ4 సర్వేపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం



తిరుపతి(కలెక్టరేట్), జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ4 తీసుకువచ్చారని వచ్చే 15కల్లా జిల్లాలో ఇచ్చిన లక్ష్యాని చేరుకోవాలని అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రభుత్వం పీ4ను తీసుకువచ్చిందని వివరించారు. ఆదాయంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించాలన్నారు. వీరిని ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నవారు దత్తత తీసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. పేదలకు సహాయ సహకారాలు అందించేందుకు మార్గదర్శకులుగా పేరు పెట్టడం జరిగిందన్నారు. ఆగస్టు 15 నాటికి జిల్లాలో పీ4 సర్వే పూర్తి కావాలన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఇక పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకూడా గడువులోగా పరిష్కరించాలని అర్జీదారులకు స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్ఎక్స్‌లో ఫోను పెడితే చాలు..!

● కొంటానంటూ వస్తాడు ● సోదరుడికి ఫోను చూపిస్తానంటూ పారిపోతాడు

● మళ్లీ ఫోను అమ్మకానికి పెట్టి పట్టుకున్న బాధితుడు

తిరుపతి(నేరవిభాగం), జూలై 22(ఆంధ్రజ్యోతి): ఓఎల్ఎక్స్ యాప్‌లో ఖరీదైన ఫోనును అమ్మకానికి పెడితే చాలు. నేను కొంటానంటూ ఫోను చేస్తాడు. నేరుగా కలిశాక మాయమాటలు చెప్పి.. ఇంట్లో చూపించి వస్తానంటూ ఆ ఫోనుతో పారిపోతాడు. అలాంటి మోసగాడిని.. ఓ బాధితుడే తన స్నేహితులతో కలిసి రెండు రోజుల కిందట పట్టుకున్నారు. ఇందులో బాధితుడు తిరుపతికి చెందిన సోని అయితే నిందితుడు విజయవాడవాసి సుబ్రహ్మణ్యం. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యం తిరుపతిలో ఉంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. పది రోజుల కిందట పద్మావతినగర్‌కు చెందిన సోని తన యాపిల్ ఫోన్‌ను విక్రయించడానికి ఓఎల్ఎక్స్ యాప్‌లో పెట్టారు. ఓఎల్ఎక్స్‌లో చూసిన సుబ్రహ్మణ్యం.. ఆ నెంబరుకు ఫోను చేశాడు. యాపిల్ ఫోన్ మొత్తం క్లియర్ చేసుకుని.. కొరమేనుగుంట వద్ద ఉన్న తన వద్దకు తీసుకొస్తే మాట్లాడి కొనుక్కుంటానని చెప్పాడు. ఆ ప్రకారం మొబైల్ ఫోన్ తీసుకుని సోని వెళ్లారు. ఈ ఫోన్ చూసిన సుబ్రహ్మణ్యం.. ఇదే అపార్టుమెంటులో ఉంటున్న తన సోదరుడికి చూపించి తీసుకొస్తానని చెప్పి వెళ్లాడు.రెండు గంటలైనా రాక పోయే సరికి అతడికి ఫోన్ చేశారు.తాను ఇక్కడే ఉన్నానని, వస్తానంటూ చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. చివరకు మోసపోయానని గుర్తించిన బాధితుడు.. తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నిందితుడిని అదుపులోకి తీసుకున్న యువకులు

ఎలాగైనా నిందితుడ్ని పట్టుకోవాలని..

ఖరీదైన ఫోన్ లాక్కెళ్లిన ఆ మోసగాడిని వదిలేయకూడదని సోని, అతడి స్నేహితులు భావించారు. అతడిని పట్టుకునేందుకు పథకం పన్నారు. మళ్లీ ఓఎల్ఎక్స్ యాప్‌లో యాపిల్ ఫోన్ విక్రయానికి ఉంచారు. దీనిపైనా స్పందించిన సుబ్రహ్మణ్యం.. ఆ ఫోన్ కొంటానంటూ ఆ నెంబరుకు సంప్రదించాడు. తాను ఓ కారు షోరూము వద్ద ఉన్నానని, అక్కడికి ఫోన్ తీసుకొస్తే చూసి కొనుక్కుంటానని చెప్పాడు. రెండు రోజుల కిందట సోనితో పాటు అతడి స్నేహితులు దాదాపు 10 మంది అక్కడకు వెళ్లారు. సోని దూరంగా ఉండగా.. మిగతా స్నేహితులు కథ నడిపారు. వీరి వద్ద ఫోను చూసి ధర ఎంత అని సుబ్రహ్మణ్యం అడగ్గా.. వారు రూ.1.5 లక్షలని చెప్పారు. దీనికి సరేనన్న సుబ్రహ్మణ్యం.. ఫోను ఇస్తే సోదరుడికి చూపించి వస్తానన్నాడు. ఆ వెంటనే వీరంతా మోసగాడిని పట్టుకున్నారు. తమ వాహనంలో తీసుకొచ్చి తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు అప్పగించారు. పోలీసుల విచారణలో సోని ఫోను ఎక్కడ అమ్మిందీ చెప్పాడు. ఆ ప్రకారం ఓ మొబైల్ షాపు వద్దకు వెళ్లి ఆ యాపిల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇలా, దాదాపు 20 నుంచి 30 ఐ ఫోన్లు లాక్కొని పరారైనట్లు సమాచారం.

9 లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు

● రూ.10 లక్షల కోట్లతో ఎంవోయూలు చేసుకున్నామన్న మంత్రి అనగాని

రేణిగుంట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులతో 9 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకున్నామని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం రేణిగుంటలోని అంబేడ్కర్ కూడలిలో జరిగిన 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. యువతకు ఉపాధి కల్పించే దిశగా తమ ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రణాళికతో ఎమ్మెల్యే సుధీర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించారని అభినందిస్తూ, ఇక్కడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, మురుగునీటి కాలువలు కావాలని కోరారన్నారు. ఈ సమస్యలను మున్సిపల్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. గత పాలనలో ప్రజలకు ఏమి చేయకుండానే కూటమి మేనిఫెస్టోపై బురదజల్లేలా వైసీపీ ప్రచారం చేస్తోందని విమర్శించారు. గత పాలనలోలాగా రౌడీయిజం, అరాచకాలు లేకపోవడంతో శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతున్నారని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు ముని చంద్రారెడ్డి, మహబూబ్ బాషా, నేతలు సుబ్రహ్మణ్యం రెడ్డి, మునిస్వామి నాయుడు, నాదముని రెడ్డి, బుజ్జి నాయుడు, వెంకటమునిరెడ్డి, పుష్పనాదం, సుబ్రహ్మణ్యం, కన్నన్ రెడ్డి, రవి, రాజేష్ రెడ్డి, మేరీ, భాస్కర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, నవాబ్, మురళి తదితరులు పాల్గొన్నారు.



పండ్లు విక్రయిస్తున్న మహిళ సమస్యను తెలుసుకుంటున్న మంత్రి, ఎమ్మెల్యే

'సమన్వయం'తో ముందుకెళతాం: ఎమ్మెల్యే

వరదయ్యపాళెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమిప్రభుత్వంలో అంద రూ కలిసిఉండి నియోజకవర్గ సమన్వయకర్త శంకర్ రెడ్డితో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధివైపు నడిపిస్తామని ఎమ్మెల్యేకోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి కూడా అందరినీ విచారణచేసి కలుపుకొని వెళ్లమని చెప్పానే తప్ప ఆయనపై వ్యతిరేకత లేదన్నారు. వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎక్కడైనా పని ఇచ్చినా, ప్రోత్సహించినా విచారించి చర్యలు తీసుకోవచ్చన్నారు. 17 నెలలుగా ప్రతిరోజు తనను మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. అన్ని అవమానాలను తట్టుకుని పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సత్యవేడు మండలంలో ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఒకరు వానెల్లూరు పంచాయతీ సమీపంలో ర్యాంప్ ఏర్పాటు చేసి ఏడాదిగా రాత్రిసమయంలో క్వారీల ముసుగులో శ్రీసిటీ పోలీస్‌స్టేషన్ మీదుగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిందన్నారు. వాటిపై విచారించకుండా అనుమానాస్పదంగా కేసు కడుతున్నారన్నారు. ఆ అధికారి ఎంతకు దిగజారాడో తెలుస్తోందన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సైదాపురం పూర్వపు ఎంపీడీవోపై వేటు

● ఉపాధి హామీ పథకంలో అవినీతే కారణం

● ప్రస్తుతం కోట మండల పరిషత్ ఏవో

సైదాపురం/కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సైదాపురం పూర్వపు ఎంపీడీవో.. ప్రస్తుతం కోట మండల పరిషత్ కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న పి.శివకుమార్‌ను సస్పెండ్ చేసినట్లు జడ్పీ సీఈవో మోహన్ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైదాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సమయంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సిబ్బంది వద్ద నగదు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు పూర్తిస్థాయిలో విచారించిన ఉన్నతాధికారులు వాస్తవమని తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● 247 నుంచి 358కి

తిరుపతిలో పెరగనున్న పోలింగ్ కేంద్రాలు

తిరుపతి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నిక కమిషన్ మార్గదర్శకాలనుసారం తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి. ఇప్పటి వరకు 109 ప్రాంతాల్లో 274 పోలింగ్ కేంద్రాలు ఉండగా... 126 ప్రాంతాల్లో 358కి కేంద్రాలు పెంచేలా చర్యలు చేపట్టామని అర్బన్ తహసీల్దారు సురేష్‌బాబు మంగళవారం మీడియాకు తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1,200ఓట్లకే పరిమితం చేశామన్నారు. అనివార్య కారణాల దృష్ట్యా 13ప్రదేశాలు మార్పు జరిగిందని, 2 పోలింగ్‌స్టేషన్ల పేర్లు సవరణ చేశామన్నారు. ఈ నివేదికను 25న కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. త్వరలోనే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ డోర్ టూ డోర్ సర్వే చేపడుతామన్నారు. తద్వారా కుటుంబ సభ్యులందరు ఒకే పీఎస్‌లో ఓటు వేసేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

శ్రీవాణి ట్రస్టు భక్తులకు నూతన భవనం



కౌంటర్లు ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో, అధికారులు

తిరుమల, జూలై22(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేసేందుకు తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా ఉన్న నూతన కేంద్రాన్ని మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించాక కొందరు భక్తులకు టికెట్లను జారీ చేశారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవాణి టికెట్ల కోసం భక్తులు ఉదయం 5 గంటల నుంచే క్యూలైన్‌లో నిలబడుతున్నారని, ఈ నేపథ్యంలో భక్తులకు సులభతరంగా టికెట్లు జారీ చేసేందుకు రూ.60 లక్షలతో నూతన కౌంటర్లను నిర్మించామన్నారు. బుధవారం నుంచి ఈ కౌంటర్ల ద్వారా భక్తులకు టికెట్లు జారీ చేస్తామన్నారు. అనంతరం హెచ్‌వీసీ, ఏఎన్సీ ప్రాంతాల్లో ఆధునికీకరించిన ఉప విచారణ కార్యాలయాలను టీటీడీ చైర్మన్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, జంగా కృష్ణమూర్తి, భానుప్రకాష్‌రెడ్డి, శాంతారామ్, నరేష్, సదాశివరావు, నర్సిరెడ్డి, జానకీదేవి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం

● టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మంచు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మంచు లక్ష్మి

నాయుడుపేట టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ కృషి చేస్తోందని ఫౌండేషన్ చైర్‌పర్సన్, సినీ నటి మంచులక్ష్మి పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణం రాజగోపాలపురం ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూంను మంగళవారం మంచు లక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 320 డిజిటల్ క్లాస్ రూంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ అమ్మమ్మ ఊరైన నాయుడుపేట ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ రూంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అంతకుముందు నాయుడుపేటలో ఉన్న తన తల్లి సమాధి వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఈవో సనత్‌కుమార్, ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయుడు జనార్దనరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, మాజీ కౌన్సిలర్ శేషం మునిగోపి, టీడీపీ నాయకులు పెనల కిషోర్‌బాబు, నానాబాల సుబ్బారావు, అవధానం సుధీర్, సాయి, సురేష్, మస్తాన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఆరేళ్ల ఎదురుచూపు

● వెటర్నరీ వర్సిటీ అధ్యాపకులకు బకాయిల విడుదల

తిరుపతిరూరల్, జూలై22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్సిటీ పరిధిలోని అధ్యాపకుల ఆరేళ్ల ఎదురుచూపు ఫలించింది. యూజీసీ అరియర్స్ విడుదలయ్యాయి. ఈ మేరకు యూజీసీ-2016 రివైజ్డ్ పే స్కేల్ అరియర్స్‌లో రాష్ట్రప్రభుత్వ వాటా 50శాతానికి సంబంధించిన రూ.12.78కోట్లను విడుదల చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అదనపు బడ్జెట్‌లో యూజీసీ రెగ్యులర్ అధ్యాపకులకు రాష్ట్రప్రభుత్వ 50శాతం, పెన్షనర్స్‌కి వందశాతం మంజూరు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. యూజీసీ ఆర్పీఎస్ -2016 ప్రకారం అప్పట్లో అధ్యాపకులకు పెరిగిన వేతనాలను రాష్ట్రంలో 2019 ఏప్రిల్‌నెల నుంచి ఇంప్లిమెంట్ చేశారు. దీనికి సంబంధించి 2016జనవరి1 నుంచి 2019మార్చి 31వరకూ వర్సిటీ అధ్యాపకులకు బకాయిలు చెల్లించని పరిస్థితి. దీనిలో రాష్ట్రప్రభుత్వ వాటా 50శాతానికి ఐసీఏఆర్ మ్యాచింగ్‌గ్రాంట్ 50శాతం వాటా కలుపుకుని అధ్యాపకులకు వందశాతం అరియర్స్‌ని చెల్లించాలి. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ 50శాతం వాటాన్ని వర్సిటీ బడ్జెట్‌లో చూపిన తర్వాతనే మ్యాచింగ్ గ్రాంట్ 50శాతాన్ని విడుదల చేస్తామని ఐసీఏఆర్ అధికారులు సూచించారని సమాచారం. ఆ క్రమంలో రాష్ట్రప్రభుత్వ వాటాకి సంబంధించి వర్సిటీలో బడ్జెట్‌లో నిధులులేని కారణంగా ఐసీఏఆర్ మ్యాచింగ్ గ్రాంట్ వాటా నిధులు ఇవ్వకుండా ఇన్నేళ్లు తాత్సారం చేశారని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. గతవైసీపీ ప్రభుత్వ పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ఆరేళ్లుగా అరియర్స్ కోసం ఎదురుచూడాల్సి వచ్చిందని అంటున్నారు. ఇక ఐసీఏఆర్ మ్యాచింగ్‌గ్రాంట్ నిధులను తెచ్చుకోవాల్సి ఉందని అంటున్నారు.

చిలుక వాహనంపై చెంగల్వరాయస్వామి పురవిహారం



శ్రీకాళహస్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా విజ్ఞాన గిరిపై వెలసిన శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఉదయం చిలుక వాహనంపై ఊరేగారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, మేళ తాళాల నడుమ స్వామి అమ్మవార్లను చిలుక వాహనంపై అధిష్ఠింపజేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లోలెవల్ బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు ఇవ్వండి

● మంత్రిని కోరిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో ఇబ్బందికరంగా ఉన్న పలు లోలెవల్ బ్రిడ్జిలకు నిధులు కేటాయించాలని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మంగళవారం కోరారు. ఆమందూరులోని ఎమ్మెల్యే నివాసానికి మంత్రి విచ్చేశారు. ఈ సందర్భంగా పాపానాయుడుపేట నుంచి గుడిమల్లం వెళ్లే మార్గంలో స్వర్ణముఖి నదిపై లోలెవల్ వంతెన నిర్మాణానికి, ఏర్పేడు నుంచి కొత్తవీరాపురం మీదుగా ఎనిమిది గ్రామాలకు వెళుతున్న మార్గంలో మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి వంతెనకు, మునగలపాళెం, గోవిందవరం మధ్య ఉన్న వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. అందుకు సంబంధించి ప్రతిపాదనలను మంత్రికి అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత ధనంజయలునాయుడు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా బాలాజీ నియామకం

రేణిగుంట జూలై 22:(ఆంధ్రజ్యోతి) రేణిగుంటకు చెందిన బీడీ బాలాజీ బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మునిక్రిష్ణయ్య



సత్యవేడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యవేడు మండలం పాలగుంటకు చెందిన ఆపార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మండల అధ్యక్షుడు ఎస్.మునిక్రిష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

పారదర్శకంగా పథకాల అమలు

శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నట్లు బొజ్జల బృందమ్మ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెంలో ఆమె ఇంటింటా తిరిగారు. ఏడాది కాలంలో చేసిన పనులను ప్రజలకు వివరించారు, భవిష్యత్తులో చేయబోయే అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు టీడీపీ మండలాధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంజేరమ్మకు ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): వడమాల పేట సమీపంలోని అంజేరమ్మ కనుమ ఆలయాన్ని మంగళవారం టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో బొజ్జల సుధీర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని మొక్కుకున్నట్లు తెలిపారు. దీంతో ఆ మొక్కును తీర్చుకున్నట్లు తెలిపారు.

అచ్యుతానందన్‌కు నివాళి

రేణిగుంట జూలై 22:(ఆంధ్రజ్యోతి): సీపీఎం అగ్రనేత కేరళ మాజీ సీఎం కామ్రేడ్ అచ్యుతానందన్‌కు ఆ పార్టీ నాయకులు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళుల ర్పించారు. సీపీఎం నాయకులు వెంకటరమణ, సీపీఐ నాయకుడు తులసి రాజన్, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి స్వామి, ఎంపీటీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించండి ప్లీజ్

రేణిగుంట జూలై 22(ఆంధ్రజ్యోతి) స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన బాలికల ప్లస్ పాఠశాలలో అధ్యాపకులు కొరత తీర్చాలని జన విజ్ఞాన వేదిక, పూర్వ విద్యార్థుల సంఘం, విద్యా వికాస వేదిక సభ్యులు కోరారు. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినుల 169 మంది ఉన్నారని తెలియజేశారు. బోటనీ, ఇంగ్లీష్, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులకు అధ్యాపకులు లేరని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి అధ్యాపకులను నియమించాలని కోరారు. ఈ మేరకు జేవీవీ కార్యదర్శి కుప్పుస్వామి, విద్యా వికాస వేదిక కన్వీనర్ వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి : ఎంఈవో

సత్యవేడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా వడ్డించాలని ఎంఈవో రవి నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని పేరడం, శిరుణంబూదూరు, బాలకృష్ణాపురం, కాదిరివేడు, మదనంబేడు, వీఆర్‌కండ్రిగ తదితర పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని, రాగిజావను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సరుకుల నిల్వ రికార్డులను పరిశీలించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

వెంకటగిరి టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్లగుంట ఎస్సీ కాలనీలో తడి, పొడి చెత్తపై ఎంపీడీవో గుణశేఖర్ మంగళవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరుచేసి గ్రీన్ అంబాసిడర్లకు ఇచ్చి గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

రేపు పలు రైళ్ల రద్దు

తడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు ప్రాంతంలో గుమ్మిడిపూడి - కవరపేట మధ్య ఇంజనీరింగ్ పనులు జరుగుతున్న కారణంగా 24వ తేదీ గురువారం మధ్యాహ్నం 1.15నుంచి సాయంత్రం 5.15 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు.

రద్దైన రైళ్ల వివరాలు...

- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు రద్దయ్యాయి.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.15, 3.10కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 11.35, మధ్యాహ్నం 12.40, 1.40, 2.40, 3.05, 3.45కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.00, 2.30, 3.15, 3.45, 4.30కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెంగల్‌పట్టు నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.55కు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైలును మీజూరు వరకు నడపనున్నారు.
- గుమ్మిడిపూడి నుంచి తాంబ్రంకు మధ్యాహ్నం 3.00కు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైలు మీజూరు నుంచి బయలుదేరి వెళ్లనుంది.

అలాగే మరికొన్ని రైళ్లు పొన్నేరి, చెన్నై మధ్య నడపనున్నట్లుగా చెన్నై డివిజన్ అధికారులు తెలిపారు.

ఫెన్సింగ్ రాయిని ఢీకొని దుప్పి మృతి

గూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఫెన్సింగ్ రాయిని ఢీకొని చుక్కలదుప్పి మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు... మండలంలోని గోగినేనిపురం సమీపంలో మంగళవారం ఓ చుక్కలదుప్పి రోడ్డు దాటుతూ ఫెన్సింగ్ రాయిని ఢీకొనడంతో మృతిచెందింది. స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

చిల్లకూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లిపేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎన్‌ఆర్‌ఐ సతీష్ ఆయన తల్లిదండ్రులు సూర్యప్రకాష్, రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం 20 కుర్చీలను వితరణగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుకర్, శేషయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీవి స్కాములు... కూటమివి స్కీములు: విజయశ్రీ

ఓజిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనంతా స్కాములు జరగ్గా... కూటమి స్కీములతో సంక్షేమం అందిస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం అత్తివరం గ్రామంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి అధ్వర్యంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్డు, దాతల సాయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగిన స్కాముల ఫలితాన్ని నేడు ఆ పార్టీ నేతలు అనుభవిస్తున్నారన్నారు. లిక్కర్ స్కాముతో దోచుకోవడంతో పాటు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏఈ రవివర్మ, ఏపీఎం పద్మ, ఏపీవో చిన్నయ్యతో పాటు పెళ్ళకూరు మండల టీడీపీ కన్వీనరు సంచి కృష్ణయ్య, ఓజిలి మండల ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్కే ఖలీల్, నాయకులు గున్నం మధురెడ్డి, ఎద్దల ధనుంజయరెడ్డి, బచ్చల రవీంద్రారెడ్డి, దారా అంకయ్య, పురుషోత్తంరాజు, ఫణీంద్రరెడ్డి, ఈశ్వరరాజు, కమలాకర్, మన్మథ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం

విద్యార్థుల ప్రగతిని హోలిస్టిక్స్ కార్డ్‌లో నమోదు చేయాలి

నాయుడుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతిని హోలిస్టిక్స్ కార్డ్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ అన్నారు. పట్టణంలోని విశ్వం జూనియర్ కళాశాలలో మంగళవారం గూడూరు డివిజన్‌లోని 14 మండలాల విద్యాశాఖ అధికారులు, 1, 2 క్లస్టర్స్ ప్రధానోపాధ్యాయులకు, సీఆర్‌ఎంపీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల నమోదు యూడేస్ క్లబ్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. అలాగే కొత్తగా నమోదు చేసిన విద్యార్థులకు కూడా తల్లికి వందనం వర్తించేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకంపై ప్రత్యేక సూచనలు ఇచ్చారు. ఆధార్ లేని విద్యార్థులకు ఎంపీడీవో, సచివాలయ సిబ్బందితో మాట్లాడి నమోదు చేయించాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ క్లాసులను తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీవైఈవో సనత్‌కుమార్, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి సురేష్, ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎంఈవో మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

నేదురుమల్లి ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్ నాయుడు

వెంకటగిరి, జులై 22 (ఆంధ్రజ్యోతి) టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని భూ కబ్జాలకు పాల్పడుతున్నట్లు వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి చేసిన ఆరోపణలను నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం పుచ్చుకుంటానని తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు సవాల్ విసిరారు. పట్టణంలోని 6వ వార్డులో మంగళవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీరాందాస్ గంగాధర్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ ఇటీవల నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఖండించారు. టీడీపీ నాయకులు ఎవరైనా ఒక్క సెంటు భూమి ఆక్రమించి ఉన్నా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన వెంకటగిరి తహసీల్దార్ రాత్రి 12 గంటల వరకూ దొంగ పట్టాలపై సంతకాలు పెడుతూనే ఉన్నారని నేదురుమల్లి ఆరోపించడంలో అర్థం లేదన్నారు. అవసరమైతే తహసీల్దార్ కార్యాలయంలో సీసీ పుటేజీలు తెప్పించుకుని చూస్తే తెలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల లబ్ది చేకూరుతోందని చెప్పారు. రాంకుమార్‌రెడ్డి బురద చల్లడం మాని అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు అవ్వారు సత్యనారాయణ, రామకృష్ణ, జనసేన నాయకుడు జంపాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గూడూరు అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలింగాపురం, మిటాత్మకూరు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాశాఖ ఏవో రమేష్ పంటల సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. అవసరమైన మేరకే రసాయనిక ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో కల్యాణి, శివశంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి, తిమ్మానాయుడు పాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వరి పంటలకు వచ్చే చీడపీడలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, సహాయ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీని బలోపేతం చేయండి

కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అధికార టీడీపీ వైఫల్యాలను తెలియజేస్తూ గ్రామస్థాయి నుంచి వైసీపీని బలోపేతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మేరిగ మురళి అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్‌లో గల నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో మంగళవారం వైసీపీ నాయకుల సమావేశం జరిగింది. కొడవలూరు ధనంజయరెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, మధుసూదనరెడ్డి, రమణారెడ్డి, రాఘవరెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ఎజెండా

సూళ్లూరుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ఎజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం రాత్రి సూళ్లూరు, నాగరాజపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతుంటే ప్రతిపక్ష నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నామన్నారు. అనంతరం టీడీపీ నాయకులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతనిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రమణ్యం, కౌన్సిలర్ ఈదూరు చెంగమ్మ, వెంకటస్వామి, దంతాల రవి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

దొరవారిసత్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం వెదురుపట్టులో నాగముంతల పోలయ్యపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో అదే గ్రామానికి చెందిన నాగముంతల సుధాకర్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 18న పొలం విషయంలో గొడవ కారణంగా పోలయ్యపై సుధాకర్, అనవల మోహన్ హత్యాయత్నం చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ అజయ్‌కుమార్ నిందితుడు సుధాకర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరొక నిందితుడు మోహన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న మున్సిపాలిటీ కార్మికులు

సూళ్లూరుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించి వేతనాలు పెంచాలంటూ సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు మంగళవారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు లక్ష్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు చంద్రశేఖర్, పద్మనాభం, రియాజ్, బాలాజి, కరీం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

గూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేలా అధికారులు చొరవ తీసుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లటూరు గ్రామంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న గిరిజన మహిళకు సంబంధించిన సమస్యపై మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడేందుకు వెళ్లగా ఆయన దురుసుగా వ్యవహరించడాన్ని ఖండించారు. ఉన్నతాధికారులు ఈవిషయమై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, ప్రసాద్, చంద్రయ్య, శంకరయ్య, మధు, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

గూడూరు అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రతకు పరిశ్రమల యాజమాన్యాలు ప్రాధాన్యం ఇవ్వాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. మంగళవారం పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసే సిబ్బంది ప్రమాదాల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి అమెరికావాసి విరాళం

కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెలపూడిలో చర్చి నిర్మాణానికి అమెరికాలోని డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ జయరావు రూ.లక్ష విరాళం మంగళవారం అందజేశారు.

పుత్తూరు వార్తలు

సమాచార హక్కు చట్టంతో పాలనలో పారదర్శకత

పుత్తూరు,జూలై22 (ఆంధ్రజ్యోతి): పాలనలో పారదర్శకత, అవినీతి నియంత్రణ కోసం సమాచార హక్కును రూపొందించారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. సమాచార హక్కు చట్టం రూపొందించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు ఆర్టీఐపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మరో నాలుగు రోజుల్లో ఈ అంశం మీద వివిధ పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందిస్తామని అన్నారు. అధ్యాపకులు కోటేశ్వరయ్య, మన్యం నరసింహులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పుత్తూరు టౌన్, జులై 22(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండల పరిధిలోని పరమేశ్వర మంగళం వద్ద ఉన్న దక్షిణ కాళీ వరహా శక్తి పీఠంలో ఆడినెల ఉత్సవాలలో భాగంగా ఈ నెల 24 గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శక్తిపీఠం చైర్మన్ మోహనమ్మ తెలిపారు.

అచ్యుతానందన్‌కు ఘననివాళి



పుత్తూరు టౌన్,జూలై 22(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు పుత్తూరులోని గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, కార్యదర్శి వెంకటేష్ తదితరులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు విజయ్, శివ, రమేష్, కృష్ణమూర్తి, రవి, ప్రవీణ్‌కుమార్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం



వేమాపురంలో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

వడమాలపేట,జూలై 22(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండల క్లస్టర్ కన్వీనర్ సుబ్రమణ్యం రాజు(పెద్దబ్బరాజు) తెలియజేశారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వేమాపురం పంచాయతీలో సంవత్సరం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం పై ఇంటింటా కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో-కన్వీనర్ హేమావతి, నాయకులు వేణుగోపాల్ ఆచ్చారి, శ్రీనివాసులు, యుగంధర్, నారాయణ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిరుపేదల మెరుగైన వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని 8 మందికి రూ.6.26 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. లబ్ధిపొందిన వారిలో వడమాలపేట మండలం అప్పలాయగుంట వడ్డిపల్లికి చెందిన చంద్రయ్య కుటుంబ సభ్యులు, ఏకాంబర కుప్పం, నగరిపేట, వీఎస్‌ఆర్ పేట, నింద్ర, అగరంపేట ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు.

రోడ్లపై బర్త్‌డే పార్టీలు నిషిద్ధం

పుత్తూరు అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జన సంచారం కలిగిన ప్రాంతాలలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా బర్త్‌డే పార్టీలు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఓబయ్య హెచ్చరించారు. రోడ్లపై ఫొటో షూట్‌లు, బర్త్‌డే పార్టీలు, బైక్ రేస్‌లు, ఇతర సెలబ్రేషన్‌లు చేసుకోవడం నిషిద్ధం అని తెలియజేశారు. పుత్తూరు ఫ్లైఓవర్, హైవేలో ఇటీవల కాలంలో ఫొటో షూట్‌లు, బర్త్‌డే పార్టీలలో బాణసంచా పేళల్లు వంటివి జరిగినట్లు సమాచారం అందిందని వివరించారు. ఇకపై ఇటువంటివి పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

పుత్తూరు మున్సిపల్ డీఈకి ఈఈగా పదోన్నతి

● చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్‌కు బదిలీ

పుత్తూరు అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ డీఈగా పనిచేస్తున్న టి.చంద్రశేఖర్ రెడ్డికి ఈఈగా పదోన్నతి లభించింది. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది డీఈలకు పదోన్నతి కల్పించి వారికి స్థాన చలనం కలిగించారు.



చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ

శ్రీకాళహస్తి
సత్యవేడు

స్మార్ట్‌మీటర్లను అడ్డుకోండి

శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆదానీకి మేలు చేసే స్మార్ట్ మీటర్లను ప్రజలు అడ్డుకోవాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ముందుగా కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆగస్టు 5న వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా పాల్గొనాన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, నాయకులు గోపి, గంధంమణి, పెనగడం గురవయ్య, అన్వర్ బాషా, షరీఫ్, పులి శ్రీకాంత్, గోవిందయ్య, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ మైనార్టీ అధ్యక్షులు మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్‌ను శ్రీకాళహస్తి మైనార్టీ నాయకులు మంగళవారం తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో ముస్లింల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని నాయకులు ఆయనను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో షాకీరాలీ, ఖాదర్‌బాషా, జిలానీబాషా, షఫీ, అస్మత్, మస్తాన్, కరీం, ఫ్రూట్ మీర్జా, అబ్దుల్ కరీం, జహీర్, మీర్జా, నయూమ్, ముజీబ్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో శిల్పారామం చైర్‌పర్సన్



శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం రాష్ట్ర శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి స న్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్లజ్ఞాపిక , తీర్థప్రసాదాలు అందజేశారు.

గోవర్ధనపురం పాఠశాలకు తీరిన దాహం



వరదయ్యపాళెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలం లోని గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఈ పాఠశాలలో సుమారు 500మంది విద్యార్థులు ఉన్నారు. తాగునీటి వసతి లేదు. దీంతో డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు, ప్రధానోపాధ్యాయులు మోహీద్దీన్, పీడీ ముద్దుకృష్ణ ఈ సమస్యను ఎమ్మెల్యే ఆదిమూలం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఎంపీడీవో ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మంగళవారం నూతనబోరు వేయించారు. బోరులో నీరు పుష్కలంగా పడ్డాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలను మోసం చేసింది వైసీపీనే



మాట్లాడుతున్న రెడ్డివారి గురవారెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలను మోసం చేసింది వైసీపీయేనని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఇటు రాష్ట్రాభివృద్ధికి అటు సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో పింఛను రూ.3వేలు చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. వెయ్యి పెంచడానికి 5 సంవత్సరాల కాలం తీసుకున్నారన్నారు. చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారాలను ప్రజలు నమ్మరన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, దొరైరాజ్‌రెడ్డి, రాఘవల్‌యాదవ్, సదాశంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ

నాగలాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): నాగలాపురంలో మూడు రోజులకు ముందు జరిగిన వరుస చోరీల కలకలం మరువక ముందే మరో వస్త్ర దుకాణంలో జరిగిన చోరీ ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. నాగలాపురం పోలీసుల కథనం మేరకు..నాగలాపురం బజారు వీధిలోని ముస్తఫా వస్త్ర దుకాణంలో గత శనివారం చోరీ జరిగింది. ఇద్దరు యువకులు ముఖాలకు మాస్కులు ధరించి దుకాణం తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించి కొంత నగదు, బట్టలను చోరీ చేశారు. ఆ దుకాణంలోని సీసీ ఫుటేజీల ద్వారా యజమాని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మామిడి రైతులకు ప్రభుత్వం అండ



జయచంద్రనాయుడు

శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని తొట్టంబేడు మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు జయచంద్రనాయుడు అన్నారు. మంగళవారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు కిలోకు రూ.4చొప్పున ఇవ్వడానికి రూ.150కోట్లు రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేయనుందన్నారు. ఇక పల్ప్ పరిశ్రమలు రూ.8లు కలిపి మొత్తం రూ.12లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌చౌహాన్ చొరవతో మామిడి క్వింటాల్‌కు కేంద్రం రూ.1,490 మద్ధతు ధర ప్రకటించిందన్నారు. సబ్సిడీ రూపంలో 50:50 నిష్పత్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ సబ్సిడీ నేరుగా రైతుల ఖాతాల్లో జమకానున్నట్లు తెలిపారు. రైతుల పక్షాన నిలబడిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సీఎంచంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ సంఘం జిల్లా చైర్మన్‌గా వేణుగోపాల్

రేణిగుంట, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముదిరాజు సంఘం జిల్లా చైర్మన్‌గా కుర్రకాలువ వేణుగోపాల నియమితులయ్యారు. మంగళవారం మండలంలోని జీ.పాలెం పంచాయతీ కుర్ర కాలు వలో ముదిరాజ్ సంఘం కోలి జాతీయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. తిరుపతి జిల్లా చైర్మన్‌గా కుర్రకాలువ వేణుగోపాల్, ఉపాధ్య క్షులుగా రామకృష్ణ (విజయవాడ) బాలకృష్ణ, శీను, (తిరుపతి) విద్యార్థి విభాగం నుంచి మునికుమార్‌రెడ్డి, కళ్యాణ్‌ను నియమించారు. ఈ మేరకు జాతీయ కోలి ముదిరాజ్ ఏపీ యువజన అధ్యక్షుడు దుడంరెడ్డి బాబు ప్రకటించారు.



వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న బాబు

రేపు ఉచిత క్యాన్సర్ పరీక్షలు

నారాయణవనం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24తేదీన గురువారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలోని పింక్ బస్సు ద్వారా నారాయణవనంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి దర్శిత్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, విరేచనాల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 22 (ఆంధరజ్యోతి): మండలంలోని పార్లపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో వర్షపునీరు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులు నుంచి తరచూ వర్షాలు కురుస్తుండటంతో పాఠశాల ఆవరణం లోతట్టుగా ఉండడంతో నీరంతా నిలిచిపోయంది. అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ లేకుండా చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా వైసీపీ ధర్నా

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం ఎదుట వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నిరసన నల్లబాడ్జీలు ధరించి తెలియజేశారు. ఆ పార్టీ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మణినాయుడు, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి నాయకులు గోపాల్ రెడ్డి, సాయినాయుడు, గురున్నాథం, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేయొచ్చు

పిచ్చాటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తేపూర్తిగా నయం చేసుకోవచ్చని పీహెచ్‌సీ డాక్టర్లు ముని చరిత, ధనుష్ తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో పింక్ బస్ ద్వారా ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు పలు క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శివయ్య, సర్పంచ్ రోస్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

పిచ్చాటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంకేటీ కల్యాణ మండపంలో బుధవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉదయం నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభిస్తారని ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం 11 గంటలకు టీచర్స్ కాలనీలో సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వివరించారు.

నేడు తొలి అడుగు

పిచ్చాటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి బుధవారం సాయంత్రం 3 గంటలకు సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని పిచ్చాటూరులో నిర్వహించనున్నారు. నాయకులు సతీష్‌నాయుడు, పద్మనాభరాజు, తిరుమల రెడ్డి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం



కరపత్రాలను పంచుతున్న నాయకులు

సత్యవేడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించి, రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పరుచూరి శివకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఉలవచేను, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో శివకుమార్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివయ్య, ల్యాంకో వాసు, జడేరి బాబు, క్రిష్ణయ్య, దిలీప్, కోనయ్య పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల హర్షం



ముక్కంటి ఆలయంలో మంత్రి జనార్దన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతోషకరంగా ఉన్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ.జనార్దన్‌రెడ్డి అన్నారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మంత్రికి ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వదంతో ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల జ్ఞాపికను అందజేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. త్వరలో మహిళలకు ఉచిత రవాణా పథకం ప్రారంభం అవుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తారని వివరించారు. అనంతరం మంత్రి ఊరందూరులోని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహానికి చేరుకుని ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మంత్రికి విన్నవించారు. ఆర్‌అండ్‌బీ అభివృద్ధి పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని మంత్రి ఎమ్మెల్యేకు భరోసా ఇచ్చారు.

వైభవంగా ప్రదోష పూజలు



నాగలాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయంలో మంగళవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని పరివార దేవతలకు అర్చకులు అభిషేకాలు చేసి దీపారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. వివిధ పుష్పాలతో సుందరంగా ముస్తాబు చేసి మహా హారతి చేపట్టారు. ఈ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.

పాఠశాలకు తాళం



నారాయణవనం, జూలై 22(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలంలోని తుంబూరు దళితవాడలోని ప్రాథమిక పాఠశాలకు గ్రామస్తులు తాళాలు వేశారు. తుంబూరు దళితవాడలోని పాఠశాలలో సుమారు 52 మంది విద్యార్థులు ఉన్నారు. 3,4,5 చదువుతున్న 39 మంది పిల్లలను తుంబూరు ఎంపీయూసీ పాఠశాలలో విలీనం చేసి అక్కడికి వెళ్లాలని విద్యాశాఖాధికారులు ఆదేశించారు. దీంతో తల్లిదండ్రులు గతనెల 19న ఆందోళన చేపట్టారు. అయినా అధికారులు స్పందించలేదు. ఈ క్రమంలో మంగళవారం పాఠశాలకు తాళం వేశారు. ముళ్ల కంపలు అడ్డుగా వేసి విలీనాన్ని రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వారి ఆదేశాల మేరకే తదుపరి చర్యలు ఉంటాయని ఎంఈవో జనార్దన్ తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ వర్మీ కంపోస్టు గుంత తవ్వుకోవాలి



కాటూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం వర్మీ కంపోస్టు గుంతలను ఉపాధి హామీ పథకం ద్వారా తవ్వుకుని ప్రయోజనాలు పొందాలని ఉపాధి హామీ పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మండలంలోని కాటూరు చెరువులో జరుగుతున్న పూడికతీత పనులను మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఓ రైతు తవ్వుకున్న వర్మీ కంపోస్టు గుంతను పరిశీలించారు. సేంద్రీయ ఎరువులు తయారు చేసి పంటలకు వినియోగిస్తే స్వచ్ఛమైన ఆహారం లభిస్తుందన్నారు. పైగా పంట పెట్టుబడి కూడా తగ్గిపోతుందని ఎక్కువ లాభాలు వస్తాయని వివరించారు. ఆయనవెంటన ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఏపీ పీవో దేవరి, కార్యదర్శి జలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీకి వినతి

- ఎంఈవో లేకపోవడంతో వినూత్న నిరసన
- పల్లంపేట పాఠశాలను తరలిస్తే ఉద్యమిస్తాం



ఎంఈవో దయాకర్ కుర్చీకి వినతిపత్రం ఇస్తున్న తల్లిదండ్రులు

ఏర్పేడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పల్లం ప్రాథమిక పాఠశాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాలు, పిల్లల తల్లిదండ్రులు ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఎంఈవో ప్రేమలత సెలవులో ఉండడంతో ఎంఈవో-2 దయాకర్‌కు వినతిపత్రం ఇవ్వాలని వెళ్లారు. అయితే వీరిని చూసి కార్యాలయం నుంచి ఆయన వెళ్లిపోయారు. దీంతో ఖాళీగా ఉన్న ఆయన కుర్చీకి వినతి పత్రం ఇస్తూ నిరసన తెలి పారు. జిల్లా రైతు సంఘం నాయకులు రంగ య్య, సీఐటీయూ నాయ కులు కరీముల్లా, డీవైఎఫ్ఐ నాయకులు రాంబాబు, రాజేంద్ర, వెంకటాద్రి పాల్గొన్నారు.

నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తా

- ఎమ్మెల్యేకోనేటి ఆదిమూలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ మండలంలో 1,137మహిళాసంఘాలు ఉన్నాయన్నారు. అందులో 605 గ్రూపు సభ్యులకు సుమారు రూ.9.68కోట్లు మంజూరైందన్నారు. గ్రూపులోని మహిళలు ఆ రుణాలను తీసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. మండలంలో నిరుపేదలకు ఇంటి పట్టాలను త్వరలోనే ఇస్తామన్నారు. మండలంలో సీసీరోడ్ల నిర్మాణాలకు సుమారు రూ.3కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, సీడీపీవో దేవకుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్ శిల్ప, జ్యోతి, వెలుగు ఏపీఎం సీతారాము, స్త్రీనిధి మేనేజరు వనజ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు తప్పిన ముప్పు



కాలువ పక్కకు ఒరిగిన బస్సు

సత్యవేడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో విద్యార్థులకు తృటిలో ప్రమాదం తప్పి ప్రాణాపాయం నుండి బయట పడ్డారు. నాగలాపురం మండలం టీపీకోట, టీపీపాళెం, కడివేడు, బీర కుప్పం, వజ్జావారి కండ్రిగ, కన్నావరం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలకు బస్సులో వెళుతుంటారు. విద్యార్థులను తరలిస్తున్న బస్సు బుధవారం ఏఎంపురం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో వాహనానికి దారి ఇచ్చేందుకు డ్రైవర్ బస్సును తప్పించబోయాడు. ఈ క్రమంలో రోడ్డు గుంతలు తేలి ఉండడంతో బస్సు అదుపు తప్పి కాలువ అంచున పక్కకు ఒరిగి పోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది విద్యార్థులున్నారు. కాగా సత్యవేడు - నాగలాపురం వయా టీపీకోట మార్గం పూర్తిగా 30 కిలోమీటర్లు గంతలు తేలి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులా మారింది. ప్రయాణం దినదిన గండంలా మారింది.

ఇష్టారాజ్యంగా గ్రావెల్ అక్రమ రవాణా



నారాయణవనం, జూలై 22(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలంలో ఇష్టారాజ్యంగా గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది. మంగళవారం మండలంలోని ఎరికంబట్టు, కసిమిట్ట, భీమునిచెరువు గ్రామాలకు సమీపంలోని కొండలు, గుట్టల నుంచి గ్రావెల్ అక్రమంగా తరలించారు. చదును చేసిన స్థలాలను సైతం కబ్జా చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే తొలి అడుగు

ఏర్పేడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడానికే సీఎం చంద్రబాబు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారని టీడీపీ సీనియర్ నేత, మాజీ జడ్పీటీసీ పేరం ధనంజయులునాయుడు అన్నారు. ఏర్పడు మండలం మర్రిమందలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు పొన్నారావు, గురవారెడ్డి, నాగ రాజునాయుడు, బాబునాయుడు, గిరిప్రసాద్ రెడ్డి, సీతాపతి ఆచారి, బత్తెయ్య, వరదయ్య, గిరినాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైభవంగా ఆండాల్ తిరువడిపురం ఉత్సవం



నారాయణవనం, జూలై 22(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో ఆండాల్ తిరువడిపురం (అమ్మవారి జయంతి) ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం ఆలయంలోని ఆండాల్ అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజుల చేశారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు పుర వీధుల్లో ఊరేగితూ భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. ఆలయాదికారి నాగరాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



పార్వతమ్మ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన తొట్టంబేడు మండలం పొయ్య ఎస్సీకాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. పొయ్య దళితవాడకు చెందిన పార్వతమ్మ(55) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. కుమార్తె శైలజ, అల్లుడు వెంకటసుబ్బయ్య మనవరాలితో కలిసి ఒకే ఇంట్లో నివసిస్తుంటారు. ఈ క్రమంలో పార్వతమ్మ ఇంటి వద్ద ఉతికిన బట్టలను ఇనుపతీగపై ఆరబెడుతుండగా షాక్‌కు గురైంది. స్థానికులు ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.